
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



గుంటూరు జిల్లా వార్తలు

ఉష్ణోగ్రత (అంచనా)

17-5-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	39	28
తెనాలి	39	28
నరసరావుపేట	39	26
బాపట్ల	37	28
రెంటచింతల	39	25
చీరాల	37	28



గుంటూరులో గాలులకు పడిపోయిన విద్యుత్ స్తంభం



గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిలిచిన వర్షపు నీరు



గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ గ్యారేజీలో నిలిచిన వర్షపు నీరు



లాలుపురం రోడ్డులోని ఖాళీ స్థలాలలో నిలిచిన నీరు

ఉరుములు.. పిడుగులు

● గుంటూరులో గాలులకు నేలకొరిగిన భారీ వృక్షం



గుంటూరులో భారీ వర్షం

గుంటూరు నగరంలో 82.5, తుళ్లూరులో 78, మంగళగిరిలో 71, తాడికొండలో 32.5, పొన్నూరులో 20.5, దుగ్గిరాలలో 17.5, ఫిరంగిపురంలో 12.5, తాడేపల్లిలో 10.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.



ఏటి అగ్రహారం మెయిన్ రోడ్డులో నిలిచిన మురుగు



కంకరగుంట ఆర్‌యూబీ కింద భారీగా చేరిన వర్షపు నీరు

- పలు ప్రాంతాల్లో అర్ధరాత్రి బీభత్సం
- గుంటూరు, బాపట్ల జిల్లాల్లోకుండపోత
- నేలకూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- గాలికి ఆటో బోల్తా ఓ మహిళ మృతి
- లోతట్టు ప్రాంతాలు జలమయం...
- మురుగుతో రోడ్లు దుర్గంధం
- పలు ప్రాంతాల్లో విద్యుత్, తాగునీటి సరఫరా లేక ప్రజల అవస్థలు


గుంటూరు, బాపట్ల, మే 16 (ఆంధ్రజ్యోతి): ఉరుములు.. మెరుపులు.. పిడుగులు.. గాలి వాన.. అర్ధరాత్రి అందరూ ఆదమరిచి నిద్రిస్తున్న వేళ బీభత్సం. నిశీరాత్రిలో భీకరమైన శబ్ధంతో ఉరుములు, కళ్లు మిరుమిట్లు గొలిపేలా ఆకాశంలో మెరుపులు, ఈదురుగాలితో కూడిన జోరు వర్షంతో గుంటూరు, బాపట్ల జిల్లా, పల్నాడు జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో ప్రజలు వణికిపోయారు. నడి వేసవిలో వాతావరణ శాఖ అంచనాకు మించి ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది. గుంటూరు జిల్లాలో శుక్రవారం వేకువజామున ముందు 2 గంటల తర్వాత నుంచి ప్రారంభమైన ప్రకృతి విపత్తు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. బాపట్ల జిల్లాలో తెల్లవారుజామున నాలుగుగంటల సమయంలో మొదలైన వర్షం దాదాపు మూడు గంటల పాటు కుండపోతగా కురిసింది. పలు చోట్ల పిడుగులు పడగా గాలి కారణంగా వర్షం పెద్దగా కురవదేమోనని అంతా భావించగా అందుకు విరుద్ధంగా భారీ వర్షం కురిసింది. ఎడతెరపి లేకుండా వర్షంతో లోతట్టు ప్రాంతాల్లోకి భారీగా వర్షపు నీరు చేరింది. ఈదురుగాలులకు చెట్లు, రేకుల షెడ్లు, హోర్డింగ్‌లు, విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. రోడ్లపై పార్కింగ్ చేసిన వాహనాలు, తోపుడు బండ్లు, టీ కొట్లు బల్లలు కూడా కొంతదూరం కొట్టుకుపోయాయి. శుక్రవారం వేకువజామున గుంటూరులోని అరండల్‌పేట మెయిన్ రోడ్డు 11వ లేన్ వద్ద ఈదురుగాలులకు ఆటో బోల్తాపడి ఓ మహిళ మృతి చెందింది. రూరల్ మండలం జొన్నలగడ్డ నుంచి ఇమ్మడి సామ్రాజ్యం(64) ఊరు వెళ్లేందుకు ఆటోలో గుంటూరు రైల్వే స్టేషన్‌కు వస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. విద్యుత్ సరఫరా నిలిచిపోవడం, దీనిపై తాగునీటి సరఫరా ఆధారపడి ఉండటంతో రెండింటికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. శుక్రవారం ఉదయం వర్షం వెలిశాక విద్యుత్ సిబ్బంది సహాయక చర్యలను ప్రారంభించినా కొన్ని ప్రాంతాల్లో సాయంత్రానికి కూడా విద్యుత్ పునరుద్ధరణ సాధ్యం కాలేదు. దీంతో ప్రజలు అటు కరెంటు లేక.. ఇటు తాగునీటి సరఫరా లేక రోజంతా అల్లాడిపోయారు. గాలికి భారీ వర్షం జత కలవడంతో రాత్రి అంతా విద్యుత్ సరఫరాని నిలిపేయడంతో ప్రజలు జాగారం చేయాల్సి వచ్చింది. ఉదయం 7 గంటల వరకు అడపాదడపాగా వర్షం కురుస్తూనే ఉన్నది. అన్ని ప్రాంతాల్లో ఓ మోస్తారు వర్షాలు కురవడంతో వాతావరణం చల్లబడి వారం రోజులుగా ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు ఉపశమనం పొందారు.

● గుంటూరు నగరంలో విద్యుత్‌శాఖకు రూ.10 లక్షల నష్టంగా అంచనా వేస్తున్నట్లు టౌన్-1 ఆపరేషన్ ఈఈ శ్రీనివాసబాబు తెలిపారు. చెట్లు ఎక్కడికక్కడ నేలకొరిగి విద్యుత్ తీగెలపై పడటంతో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రోడ్లపై రాకపోకలు కూడా స్తంభించిపోయాయి. గార్డెన్స్‌లోని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కార్యాలయం ఎదుట భారీ వృక్షం నేలకొరిగి విద్యుత్ పోల్ పడిపోయి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కాల్వల్లోని మురుగు అంతా రోడ్ల పైకి చేరి దుర్గంధాన్ని వెదజల్లడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

● అమరావతి రాజధానిలోనూ వర్షం ప్రతాపం చూపించింది. తాడికొండ తహసీల్దార్ కార్యాలయంలో రేకుల షెడ్డు కూలిపోయింది.

రైతులకు కొంత మేర నష్టం..

కల్లాల్లోని మిర్చి, పొగాకు పంటలపై రైతులు పరదాలు కప్పి జాగ్రత్తలు పాటించినా గాలివానకు నష్టపోయారు. బాపట్ల జిల్లాలో దాదాపు 850 ఎకరాల్లో మామిడి పంటకు నష్టం వాటిల్లింది. సంగంజాగర్లమూడి, అంగలకుదురు తదితర గ్రామాల్లో నిమ్మతోటల్లో పిందె దశలో ఉన్న కాయలు గాలి వేగానికి రాలి పోవడంతో రైతులు ఆందోళన చెందారు. కొల్లిపర మండలంలో పలుచోట్ల అరటి తోటలు దెబ్బతిన్నాయి. గాలివాన పొన్నూరు చేబ్రోలు మండలాల్లో వాణిజ్య పంటల రైతులకు అపార నష్టాన్ని మిగిల్చింది. పొన్నూరు ప్రాంతంలో గాలుల బీభత్సానికి అవిశె తోటలు విరిగిపడడంతో తమలపాకు పంట నేలమట్టమైంది. చేబ్రోలు మండలం నారాకోడూరు, వేజెండ్ల, శలపాడు ప్రాంతాల్లో తీగ జాతి కూరగాయ పంటలు పందిళ్లు నేలమట్టమయ్యాయి.



నారాకోడూరులో గాలులకు నేలవాలిన దొండ చేను



కంచర్లపాలెం కాలువ వద్ద విద్యుత్ లైన్‌పై పడి నేలకొరిగిన కొబ్బరి చెట్టు



కొలకలూరులో గాలులకు వాలిన విద్యుత్ స్తంభం

నాడు తిన్నారు.. నేడు బలయ్యారు

- వైసీపీ హయాంలో రక్షణ.. నేడు సస్పెన్షన్
- పది మంది మున్సిపల్ ఉద్యోగులపై వేటుతో కలకలం
- మరో నలుగురు అధికారులపై చర్యలకు సిఫార్సు
- చిలకలూరిపేట పురపాలక సంఘంలో రూ.34 లక్షలు గోల్‌మాల్
- అజ్ఞాతంలోనే ఉన్న సూత్రధారైన అవుట్ సోర్సింగ్ ఉద్యోగి

చిలకలూరిపేట, మే 16 (ఆంధ్రజ్యోతి): అధికారం అండతో నాడు మున్సిపల్ ఖజానాకు గండికొట్టారు. అక్రమాలపై నాడు టీడీపీ ఆందోళన చేసినా అటు ప్రభుత్వం.. ఇటు పుర పాలకులు పట్టించుకోలేదు. ఎట్టకేలకు వారి పాపం పండి నేడు బలయ్యారు. చిలకలూరిపేట మున్సిపాలిటీలో రూ.34 లక్షల నిధులు గోల్‌మాల్ చేసిన పది మంది ఉద్యోగులను సస్పెండ్ చేస్తూ మున్సిపల్ శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఒకేసారి పదిమంది ఉద్యోగులు సస్పెండ్ కావడం సంచలనం కలిగించింది. అప్పట్లో చిలకలూరిపేటలో పనిచేస్తూ ప్రస్తుతం వివిధ ప్రాంతాల్లో ఆయా ఉద్యోగులు విధులు నిర్వహిస్తుండగా ఒకరు ఉద్యోగ విరమణ చేశారు. చిలకలూరిపేట మున్సిపాలిటీలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేసిన ఇక్కుర్తి గంగాభవాని నిధుల గోల్‌మాల్‌లో కీలకంగా వ్యవహరించగా ప్రస్తుతం అజ్ఞాతంలోకి వెళ్లింది. 2021 మే నుంచి 2023 జూలై మధ్య మున్సిపల్ కార్యాలయంలో షరాబు దగ్గర గంగాభవాని కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేసింది. ఆ సమయంలో మున్సిపాల్ దుకాణదారులు చెల్లించే అద్దెలను ఖజానాకు జమ చేయలేదు. అనుమానం రాకుండా దొంగ రశీదులతో మాయ చేసింది. ఇలా రూ.34.34 లక్షలు గల్లంతు చేయగా అప్పట్లో టీడీపీ కౌన్సిలర్లు అనేకసార్లు కౌన్సిల్ సమావేశాల్లో ప్రస్తావించారు. అయితే వైసీపీ హయాంలో ఆమెపై ఈగ వాలకుండా చేశారు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దుకాణాల అద్దెల గల్లంతుపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. దీంతో అక్రమార్కులు కాజేసిన మొత్తంలో రూ.12.94 లక్షలు మున్సిపల్ ఖజానాకు జమ చేశారు. నిధుల గల్లంతులో సూత్రధారి గంగాభవాని కాగా ఆమెకు పలువురు అధికారులు, ఉద్యోగులు సహకరించినట్లు విచారణలో తేలింది.నిధుల గోల్‌మాల్‌లో మొత్తం 15 మందిని బాధ్యులుగా గుర్తించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. గతంలో ఇక్కడ కమిషనర్లుగా పనిచేసిన సీహెచ్ గోవిందరావు(ప్రస్తుతం అమరావతి సెక్రటేరియట్లో సెక్షన్ ఆఫీసర్), రవీంద్ర(అద్దంకి కమిషనర్), చిలకలూరిపేట ఇన్‌చార్జి కమిషనర్‌గా వ్యవహరించి ప్రస్తుతం డీఈగా ఉన్న రహీం, అప్పట్లో మేనేజర్‌గా వ్యవహరించి ప్రస్తుతం ఏలూరు అర్బన్ డెవలప్మెంట్ ఆఫీసులో ఏవోగా ఉన్న నగీనా సుల్తానాలపై చర్యలకు విచారణాధికారులు ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. కాగా తొలుత గంగాభవానిపై చిలకలూరిపేట అర్బన్ పోలీస్‌స్టేషన్లో కేసు నమోదు కావడంతో ఆమె అప్పటి నుంచి అజ్ఞాతంలో ఉంది.

సస్పెన్షన్ అయిన వారు..

చిలకలూరిపేట : అబ్దుల్‌ఖాదర్(ఆర్‌ఐ), రమేష్‌బాబు(సీనియర్ అసిస్టెంట్), విశ్రాంత ఉద్యోగి షేక్ కాలేషా(జూనియర్ అసిస్టెంట్ షరాబు)

నరసరావుపేట: ధనలక్ష్మి(సీనియర్ అసిస్టెంట్), టీ గురవయ్య, షేక్ జమీర్, జీ శ్రీనివాసమూర్తి, అల్లాభక్షు(జూనియర్ అసిస్టెంట్లు)

చీరాల: మానసకృష్ణ(సీనియర్ అకౌంటెంట్)

వెంకటగిరి: జీ వెంకటేశ్వర్లు(జూనియర్ అసిస్టెంట్)

గూడూరు: విజయలక్ష్మి(మేనేజర్)

పనులు త్వరగా ప్రారంభించాలి

- గుంటూరు చానల్ నిధులు విడుదల
- భూసేకరణ, సర్వే త్వరితగతిన చేపట్టాలి
- జలవనరులశాఖ సమీక్షలో కేంద్ర మంత్రి పెమ్మసాని

గుంటూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): గుంటూరు చానల్ విస్తరణ పనులను త్వరగా ప్రారంభించాలని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్ర శేఖర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం గుంటూరులోని తన క్యాంపు కార్యాలయంలో మంత్రి పెమ్మసాని ఇరిగేషన్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.



గుంటూరు, బాపట్ల ప్రాం తాలకు ఉపయోగపడేలా గుంటూరు చానల్ విస్తరణ అభివృద్ధి పనుల నిమిత్తం రూ.400 కోట్లను నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో భూసేకరణకు రూ.75 కోట్లు, విస్తరణకు రూ.96 కోట్లను నాలుగు విడతలుగా విడుదల చేస్తూ ప్రభుత్వం తాజాగా నిర్ణయం ప్రకటించింది. కాగా ప్రభుత్వం విడుదల చేసిన నిధులతో త్వరితగతిన విస్తరణ, భూసేకరణ పనులను ప్రారంభించాలని పెమ్మసాని అధికారు లకు స్పష్టం చేశారు. భూసేకరణని నాలుగు గ్రామాల్లో నిర్వహించాలని, సర్వే పనులను కాంట్రాక్టు సంస్థ చేపట్టాలని తెలిపారు. ప్రభుత్వానికి అందించాల్సిన ప్రతిపాదనలు త్వరితగతిన పంపాలని, వ్యక్తిగత శ్రద్ధ తీసుకుని అధికారులు పనుల చేయించాలన్నారు. సమావేశంలో ఇరి గేషన్ శాఖ చీఫ్ ఇంజనీర్ రాంబాబు, జలవనరుల శాఖ జిల్లా అధికారి వెంకటరత్నం పాల్గొన్నారు.

హెచ్ఐవీ, క్షయ కేసులను తప్పనిసరిగా గుర్తించాలి

● ఆరోగ్య శాఖ ఏడీ డాక్టర్ అనిల్‌కుమార్ ఆదేశాలు

గుంటూరు మెడికల్, మే 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలల్లో నమోదౌతున్న క్షయవ్యాధి కేసులను గుర్తించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అదనపు సంచాలకులు డాక్టర్ అనిల్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం డీఎంహెచ్ కార్యాలయంలో ప్రోగ్రామ్ ఆఫీసర్లతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. కొత్తగా నమోదయ్యే క్షయ కేసులతో పాటు హెచ్ఐవీ కేసులను డీఎంహెచ్‌వో ప్రత్యేకంగా సమీక్షించాలని సూచించారు. ప్రతి నెల ప్రోగ్రామ్ ఆఫీసర్లు అల్ట్రా సౌండ్ స్కానింగ్ కేంద్రాలను తనిఖీ చేసి పీసీ పీఎన్‌డీటీ యాక్ట్ నిబంధనలు సక్రమంగా అమలు చేస్తున్నారో, లేదో పరిశీలించాలని తెలిపారు. మాతృ, శిశు మరణాలను తగ్గించేందుకు ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలను చైతన్యవంతం చేయాలని తెలిపారు. ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యసాధనలో వెనుకబడిన కేంద్రాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. ఈహెచ్‌ఆర్, ఆబా ఐడీ లక్ష్యాలను సకాలంలో సాధించాలని చెప్పారు. అసంక్రమిత వ్యాధులపై జరుగుతున్న సర్వేను త్వరగా పూర్తి చేయాలన్నారు. రాబోయే వర్షాకాలం దృష్టిలో ఉంచుకుని అంటువ్యాధుల నిర్మూలనకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ కే విజయలక్ష్మి, ప్రోగ్రామ్ ఆఫీసర్లు ఏ శ్రావణ్‌బాబు, రోహిణిరత్నశ్రీ, సుబ్బరాయనం, బీ లక్ష్మానాయక్, జయరామకృష్ణ, వరప్రసాద్, ప్రియాంక, డెమో జయప్రసాద్, డిప్యూటీ డెమో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏడీ అనిల్‌కుమార్, డీఎంహెచ్‌వో విజయలక్ష్మి



భూముల రీ సర్వేలో మన విధానం భేష్

● తమ రాష్ట్రాల్లో అమలు చేస్తామన్న ప్రతినిధులు ● రెండు రోజుల జాతీయ కార్యశాల నిర్వహణతో గుంటూరుకు ఖ్యాతి ● కేంద్ర మంత్రి పెమ్మసాని, జిల్లా యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపిన ప్రభుత్వం

8

ఆర్టీసీలో.. కొరియర్ సేవలు సులభతరం

● త్వరలో ఆర్టీసీ ఇన్‌బస్ పార్శిల్ బుకింగ్ సర్వీస్ ● కండక్టర్‌కి ఇస్తే.. పార్శిల్ కొరియర్

తెలుగు రాష్ట్రాల స్థాయి నాటిక పోటీలు ప్రారంభం

రూ.60 లక్షల విలువైన 300 సెల్‌ఫోన్ల రికవరీ

బాధితులకు స్వయంగా అందజేసిన ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా రూ.60 లక్షల ఖరీదైన 300 సెల్‌ఫోన్లను పోలీసులు రికవరీ చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ సతీష్‌కుమార్ బాధితులకు శుక్రవారం ఆయా సెల్‌ఫోన్లను అందజేశారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు సుమారు



బాధితురాలికి సెల్‌ఫోన్ అందిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్, ఐటీ కోర్ సీఐ నిషార్‌బాషా

5 కోట్ల 80 లక్షల విలువైన 29 వేల మొబైల్ ఫోన్ల రిక వరీ చేసినట్లు ఎస్పీ తెలిపారు. సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వెంటనే బాధితులు జాతీయ సైబర్ క్రైమ్ నంబరు 1930కి లేదా పోలీస్ హెల్ప్‌లైన్ నంబరు 8688831574 లేదా సీఈఐఆర్ వెబ్సైట్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. సెల్‌ఫోన్ల వివరాలను బట్టి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి, వెతికి ఎటువంటి రుసుము చెల్లించకుండా లేకుండా బాధితులకు అందజేస్తున్నామన్నారు. ఆర్థిక లావాదేవీలు ఎక్కువగా సెల్‌ఫోన్ నుంచి చేస్తున్న ఈ రోజుల్లో సైబర్ నేరాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. అనుమానిత, బెదిరింపు కాల్స్ వస్తే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.సైబర్ నేరగాళ్లు చేసే ఫోన్ కాల్స్‌కు భయపడకుండా ఆ ఫోన్ కాల్స్‌ను వెంటనే బ్లాక్ చేయాలన్నారు. ప్రజలు ఊర్లకు వెళ్లేప్పుడు గృహ రక్షణ కోసం పోలీస్ శాఖ తరపున ఉచితంగా అందించే ఎల్‌హెచ్ ఎంఎస్ సేవను ఉపయోగించుకోవాలన్నారు. సెల్ఫోన్లను రికవరీ చేసి బాధితు లకు అందజేయడంలో కృషి చేసిన ఐటీ కోర్ సీఐ నిషార్‌భాష, హెడ్ కానిస్టేబుళ్లు కిశోర్, రమేష్, కానిస్టేబుళ్ళు శ్రీధర్, మానస, కరీముల్లాలను ఎస్పీ అభినందించారు. ఏఎస్పీ(ఏఆర్) ఏ.హనుమంతు, ఎస్బీ సీఐ అళహరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠపురవాసునికి శేషవాహన గ్రామోత్సవం

తెనాలి అర్బన్, మే 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక వైకుంఠపురంలోని శ్రీలక్ష్మీ పద్మావతీ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. స్వామివారికి శుక్రవారం శేషవాహన గ్రామోత్సవం నిర్వహించారు. ఉత్సవాలలో భాగంగా ఆలయంలో నిత్యహోమం, ఆలయ బలిహరణ నిర్వహించారు. స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను అలంకరించిన వాహనంపై మేళతాళాలతో ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. శనివారం స్వామివారికి గజవాహన గ్రామోత్సవం నిర్వహిస్తారు. ఉత్సవాలను ఈవో అనుపమ, అర్చకులు, సిబ్బంది పర్యవేక్షించారు.



ఎంపికైన లిఫ్టర్లతో పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధులు

జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక

మంగళగిరి సిటీ, మే 16 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలోని కొల్లాపూర్‌లో ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకు జరుగనున్న జాతీయ సబ్ జూనియర్, జూనియర్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు జిల్లా నుంచి 9 మంది పవర్ లిఫ్టర్లు ఎంపికయ్యారని పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొమ్మాకుల విజయభాస్కరరావు, షేక్ సంధాని తెలిపారు. మహిళల సబ్ జూనియర్స్‌లో బి.లాలిత్య (76 కేజీలు), ఈఎల్ వినయశ్రీ (84 కేజీలు), పురుషుల సబ్ జూనియర్స్‌లో టి.శివకార్తీక్ (53 కేజీలు), ఎస్.మునీశ్వర్ రామ్ (83కేజీలు), మహిళల జూనియర్స్‌లో ఎం.షానూన్ (47కేజీలు), ఎల్.చాతుర్య (76 కేజీలు), ఎస్.జ్ఞానదివ్య (84+కేజీల విభాగం), పురుషుల జూనియర్స్‌లో ఎస్.కౌశిక్ (93 కేజీలు), డి.పృథ్వీ కుమార్ (105 కేజీలు) ఎంపికయ్యారని వెల్లడించారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన లిఫ్టర్లను ఏపీ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంటా వెంకటేశ్వరరావు, సకల సూర్యనారాయణ, సౌత్ఇండియా ఆర్గనైజింగ్ సెక్రెటరీ సకల కోటేశ్వరరావు, జిల్లా వైస్‌చైర్మన్ ఆర్ఎస్ వంశీకృష్ణ, కోశాధికారి గుమ్మడి వెంకటేశ్వరరావు తదితరులు అభినందించారు.

మిర్చియార్డులో కలకలం

● అక్రమాలకు పాల్పడిన 18 మందిపై శాఖాపరమైన చర్యలు

● సస్పెన్షన్లు, సెన్సూర్, ఇంక్రిమెంట్ల కోత పెట్టే అవకాశం



గుంటూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో మిర్చియార్డులో జరిగిన అవినీతి, అక్రమాలు, నిధుల దుర్వినియోగం, ఎలక్షన్ కోడ్ ఉల్లంఘనలపై ఎట్టకేలకు ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. విజిలెన్స్ డైరెక్టర్ జనరల్ అందజేసిన నివేదిక ఆధారంగా 18 మంది అధికారులపై శాఖాపరమైన చర్యలకు ఉపక్రమించింది. ఇందులో భాగంగా బాధ్యులైన ఉద్యోగులపై సస్పెన్షన్ చర్యలు కూడా త్వరలో చేపట్టే అవకాశం ఉన్నట్లు మార్కెటింగ్ వర్గాలు తెలిపాయి. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ ఎక్స్ అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రెటరీ బుడితి రాజశేఖర్ జీవో ఆర్టీ నంబరు. 275 జారీ చేశారు. ఈ ఉత్తర్వులు సాయంత్రానికి మిర్చియార్డుకు చేరుకోవడంతో ఉద్యోగవర్గాల్లో కలకలం రేకెత్తించింది. త్వరలో ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకొంటుందోనన్న ఆందోళన వారిలో నెలకొన్నది. కచ్చితంగా సస్పెన్షన్లు, సెన్సూర్‌లు, ఇంక్రిమెంట్ల కోత వంటి చర్యలుంటాయని అంచనా వేస్తున్నారు.

మిర్చియార్డులో వైసీపీ పాలనలో అటు ఆ పార్టీ నేతలు, ఇటు అధికారులు, ఉద్యోగులు అందినకాడికి దోచుకొన్నారు. అవినీతికి కాదేది అనర్హం అన్నట్లు యార్డులో అణువణువునా ఎక్కడ అవకాశం దొరికితే అక్కడ దోచేశారు. జీరో బిజినెస్, కటింగ్, బిల్ టూ బిల్ వ్యాపారాలు, ఈనామ్‌లో మిర్చి టిక్కీల లెక్కల తారుమారు వంటి అక్రమాలకు పాల్పడ్డారు. అలానే లైసెన్సుల రెన్యువల్, భాగాస్వామ్య పేర్ల మార్పులు పెద్దఎత్తున చేశారు. కొత్త లైసెన్సులు నిబంధనలకు విరుద్ధంగా మంజూరు చేశారు. సెక్యూరిటీ డిపాజిట్లు మార్కెట్ కమిటీకి రాకుండా కోర్టులలో బలహీనంగా వాదనలు వినిపించారు. షాపుల సబ్‌లీజులు, చేతులు మారిన పర్మినెంట్ షాపుల పేర్ల మార్పులు వంటివి చేసి రూ. కోట్లు వెనకేసుకొన్నారు. దీనిపై మిర్చియార్డు మాజీ ఛైర్మన్ మన్నవ సుబ్బారావు, మాజీ ఎమ్మెల్సీ ఏ ఎస్ రామకృష్ణ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్‌కు ఫిర్యాదు చేయడంతో విజిలెన్స్ విచారణ గత ఏడాది ఆఖరులో జరిగింది. ఆ శాఖ అధికారులు విచారణ జరిపి రూ. 347 కోట్ల అవినీతి జరిగిందని నివేదిక సమర్పించగా దానిని యథాతథంగా విజిలెన్స్ డైరెక్టర్ జనరల్ ప్రభుత్వానికి పంపి చర్యలకు సిఫార్సు చేశారు. మిర్చియార్డు గత ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డితో పాటు గ్రేడ్-2 సెక్రెటరీ కే శివారెడ్డి, అసిస్టెంట్ సెక్రెటరీలు వీ ఆనందభాస్కర్, కే జయరామిరెడ్డి, సూపర్‌వైజర్లు కే సాంబిరెడ్డి, షేక్ అబ్దుల్ కరీం, సీహెచ్ శివారెడ్డి, కే వెంకట దుర్గా శివనాగరాజు, జీ మురళీకృష్ణ, షేక్ ముస్తఫా, ఎం శ్రీనివాసరావు, జీ యలమంద, ఎం రమేష్‌బాబు, సీహెచ్ పెద్దారావు, ఎం వీ రాఘవరావు, జూనియర్ మార్కెట్ సూపర్‌వైజర్లు షేక్ ఖాజా, బీ శేషుబాబు, డ్రైవర్ కే శ్రీనివాసరావులపై చర్యలకు విజిలెన్స్ సిఫార్సు చేసింది. గత సార్వత్రిక ఎన్నికల సమయంలో ఎలక్షన్ కోడ్ ఉల్లంఘించి వైసీపీకి అనుకూలంగా వీరిలో ఒకరిద్దరు ప్రచారం కూడా చేశారు. దాంతో దానిపైనా ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. విజిలెన్స్ విచారణలో భాగంగా మిర్చియార్డులో ఛైర్మన్లుగా బాధ్యతలు నిర్వహించిన వైసీపీ నేతలను కూడా విచారించింది. అయితే వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు.



రాజధాని రైతులను కలిసి అభిప్రాయాలు తీసుకుంటున్న టీఐఎస్ఎస్ విద్యార్థులు

స్వచ్ఛందంగానే రాజధానికి భూములిచ్చాం

- టీఐఎస్ఎస్ విద్యార్థుల సర్వేలో రైతుల వెల్లడి

తుళ్లూరు,మే 16,(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛందంగా రాజధాని అమరావతికి భూములిచ్చామని రైతులు స్పష్టం చేస్తున్నారు. టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్(టీఐఎస్ఎస్)కి చెందిన లా సోషల్ పాలసీ, ఎంఏ ఇన్ పబ్లిక్ పాలసీ విద్యార్థులు అమరావతిలో ల్యాండ్ పూలింగ్‌పై ప్రాజెక్ట్ వర్క్ చేశారు. రైతులు స్వచ్ఛందంగా భూములు ఇచ్చారా? ఇచ్చిన తర్వాత వారి జీవన, వ్యవహార శైలీ, వ్యవసాయ కూలీల పరిస్థితి, యువతకు ఉద్యోగ అవకాశాలు, విద్య, వైద్య సదుపాయాలు తదితర అంశాలు, అందుకు ప్రభుత్వ చర్యలను పరిశీలించారు. శుక్రవారం నుంచి రాజధాని 29 గ్రామాలలో బృందాలుగా విద్యార్థులు సర్వే చేశారు. ఈ సర్వే వివరాలను రాష్ట్ర ప్రభుత్వానికి, వరల్డ్ బ్యాంకుకు అందజేయనున్నారు. స్వచ్ఛందంగానే భూములు ఇచ్చామని, చిన్న చిన్న సమస్యలున్నా.. వాటిని సీఆర్డీఏ పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటోందని సర్వే టీం సభ్యులకు రైతులు స్పష్టం చేశారు. రాజధాని ప్రకటన ముందు నుంచే.. ఇక్కడే నివాసాలున్న వారిని గుర్తించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, వైద్యశాలల్లో ఓపీ నుండి ఆపరేషన్ దాక ఉచిత వైద్యం అందజేయాలని కొందరు రైతులు కోరారు. గత టీడీపీ ప్రభుత్వంలో అమరావతి హెల్త్ కార్డులు ఇచ్చారని వైసీపీ ప్రభుత్వంలో అవి సరిగా పని చేయలేద చెప్పారు. అమరావతి అభివృద్ధి పనులు వేగవంతంగా చేసి రైతుల ప్లాట్లకు విలువ పెంచాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. రాజధాని అమరావతికి అదనంగా 45 వేల ఎకరాలు ప్రభుత్వం తీసుకోవాలనే దాని మీద సర్వే సభ్యులు వివరణ కోరగా.. అమరావతి నగరం 217 చదరపు కిలోమీటర్లు పరిధి అభివృద్ధి చేస్తే, పక్కన ఉన్న రైతులు తమ లాగే స్వచ్ఛందంగా ల్యాండు పూలింగ్‌కి భూములు ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. టీఐఎస్ఎస్ సర్వే విద్యార్థులకు వీఐటీలో వసతి సౌకర్య కల్పించారు.

కబలించిన లారీ..!

● స్కూటీని ఢీకొట్టడంతో తల్లి మృతి, కూతురికి గాయాలు

● న్యాయం చేయాలని రోడ్డుపై బైఠాయించి బంధువుల ఆందోళన

కొల్లూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని లారీ వెనుక నుంచి ఢీకొన్న ప్రమాదంలో తల్లి అక్కడికక్కడే మృతి చెందగా.. కుమార్తె తీవ్రంగా గాయపడింది. ఈ ఘటన శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు.. అమృతలూరు మండలం మూల్పూరుకు చెందిన ఇంటూరి రూప (36) తమ కుమార్తె సుభాషిణితో కలిసి పుట్టినిల్లు దోనేపూడి శివారు గ్రామం అలపాటి నగర్‌లో బంధువుల వివాహ వేడుకకు గురువారం వచ్చారు. ఉదయం తిరిగి తన స్కూటీపై వెళ్తుండగా.. మండల పరిధిలోని మొసలిపాడు చెరువు వద్ద కొల్లూరు నుంచి వస్తున్న టిప్పర్ లారీ వెనుక నుంచి వారిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో స్కూటి వెనుక కూర్చున్న రూప రోడ్డుపై పడిపోవడంతో లారీ ఆమె పైనుంచి వెళ్లింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. స్కూటి నడుపుతున్న కుమార్తె సుభాషిణి తీవ్రంగా గాయపడింది. గమనించిన స్థానికులు వెంటనే క్షతగాత్రురాలిని 108 అంబులెన్స్‌లో తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రమాదంలో స్కూటి పూర్తిగా దెబ్బతింది. సమాచారం తెలుసుకున్న ఏఎస్ఐ అర్జున్ ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. కుమార్తె మృతి విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు, భర్త యిర్మియా, బంధువులు ఘటనా స్థలానికి చేరుకుని, రోడ్డుపై బైఠాయించారు. మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళన చేపట్టారు. వేమూరు ఎస్ఐ శివకృష్ణ, సిబ్బంది వారితో చర్చించారు. వారిని స్టేషన్‌కు తీసుకు వెళ్లగా రాత్రి 7 గంటల వరకు చర్చలు కొనసాగుతూనే ఉన్నాయి. మృతదేహం ఘటనా స్థలంలోనే ఉండిపోయింది. దీంతో భారీ ట్రాఫిక్ జామ్ కావడంతో.. వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను చూసుకున్నారు.



రోడ్డుపై ధర్నా చేస్తున్న మృతురాలి బంధువులు

జ్యోతిర్మయికి నీట్ పీజీలో ఆలిండియా 47వ ర్యాంక్



బాపట్ల, మే 16 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల పట్టణానికి చెందిన పీటా జ్యోతిర్మయి నీట్ పీజీ ఎండీఎస్ ప్రవేశ పరీక్షలో ఆలిండియా 47వ ర్యాంక్ సాధించింది. మధ్యతరగతి కుటుంబానికి చెందిన జ్యోతిర్మయి ఇంటర్మీడియెట్‌లో రాష్ట్ర స్థాయిలో 2వ ర్యాంక్ సాధించింది. సిబార్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్స్‌లో బి.డి.ఎస్ పూర్తి చేసింది. తల్లిదండ్రులు శ్రీనివాస్, విజయలక్ష్మీ కుమార్తెకు ర్యాంక్ రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

'గోపాలమిత్ర' వ్యవస్థ పరిశీలనకు కమిటీ

అమరావతి, మే 16 (ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధక శాఖలోని గోపాలమిత్ర వ్యవస్థ పనితీరును పరిశీలించడానికి ప్రభుత్వం ఒక కమిటీని నియమించింది. ఏపీ లైవ్‌స్టాక్ ఏజెన్సీ సీఈవో అధ్యక్షతన పశుసంవర్ధక, పశు వైద్య నిపుణులు ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు. ఈ మేరకు ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2019కు ముందున్న విధంగా గోపాలమిత్ర వ్యవస్థను కొనసాగించడానికి తీసుకోవాల్సిన చర్యలను సూచించాలని, గ్రామ పశుసంవర్ధక సహాయకులు, గోపాలమిత్రల మధ్య జాబ్‌చార్ట్‌పై స్పష్టమైన హద్దును కమిటీ సూచించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సైన్యానికి ప్రతీ ఒక్కరూ అండగా నిలవాలి

గుంటూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రజల ప్రాణాలను కాపాడేందుకు తమ ప్రాణాలను పణంగా పెట్టి వీరోచితంగా పోరాడుతున్న సైనికులకు ప్రజలంతా అండగా నిలవాలని రైల్వే గుంటూరు సీనియర్ డీసీఎం సీహెచ్ ప్రదీప్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం పట్టాభిపురంలోని డీఆర్ఎం కార్యాలయం నుంచి ఆపరేషన్ సిందూర్ - సాలిడారిటీ ర్యాలీని రైల్వేస్టేషన్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ డీసీఎం మాట్లాడుతూ పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారతదేశం ఆపరేషన్ సింధూర్‌ని ప్రారంభించిందన్నారు. ఉగ్రవాదుల పీచమణిచి బాధిత కుటుంబాలకు న్యాయం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ డీఎంఈ ఎం రవికిరణ్, సీనియర్ డీపీవో షాబాజ్ హనూర్, ఏఎస్‌సీ శైలేష్‌కుమార్ పాల్గొన్నారు.

పది జిల్లాల్లో డీసీహెచ్‌లు మార్పు

అమరావతి, మే 16 (ఆంధ్రజ్యోతి): పనితీరు సరిగా లేదనే కారణంతో వైద్య ఆరోగ్య శాఖ పది జిల్లాలకు కొత్త జిల్లా కోఆర్డినేటర్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్(డీసీహెచ్)లను నియమించింది. అల్లూరి సీతారామరాజు, కోనసీమ, పశ్చిమ గోదావరి, ఎన్టీఆర్, బాపట్ల, పల్నాడు, తిరుపతి, నంద్యాల, శ్రీసత్యసాయి, అన్నమయ్య జిల్లాల్లో డీసీహెచ్‌లను మార్చింది. గత మంగళవారం ప్రభుత్వ ఆసుపత్రుల పని తీరును ఆ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సమీక్షించి, ఆందోళన వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలోనే పది జిల్లాల అధికారులను మార్చారు.

యడ్లపాడులో దొంగల హల్‌చల్

నగదు, వెండి, బంగారు ఆభరణాల చోరీ

యడ్లపాడు, మే 16 (ఆంధ్రజోతి): మండల కేంద్రంలో గత అర్ధరాత్రి దొంగలు రెచ్చిపోయారు. ఖాళీగా ఉన్న రెండు గృహాల్లో చోరీకి యత్నించారు. గ్రామానికి చెందిన కారు డ్రైవర్ నరవర్య హనుమాన్‌సింగ్ గురువారం ఉదయం డ్యూటీకి వెళ్లి అర్ధరాత్రి 2 గంటల ఇంటికి చేరుకున్నాడు. ఇంటికి తలుపు తాళం పగుల గొట్టి ఉండడాన్ని గమనించాడు. లోపలికి వెళ్లి చూడగా చిందరవందరగా వస్తువు పడి ఉన్నాయి. చోరీ జరిగినట్లు గుర్తించి, పోలీసులకు సమాచారం అందించాడు. అతని కుటుంబ సభ్యులంతా మూడు రోజుల క్రితం మహబూబ్‌నగర్‌లోని బంధువుల ఇంటికి వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో దుండగులు బీరువాలో దాచి ఉంచిన నగదు రూ.20 వేల నగదు, సుమారు 500 గ్రాముల వెండి ఆభరణాలు, ప్రతిమలు, 8 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీ చేసినట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. అలాగే హనుమాన్‌సింగ్ ఇంటి ఎదురుగా ఉన్న దండా ప్రమీల నివాసంలో కూడా చోరీయత్నం చేశారు. తాళం పగులగొట్టి లోపలికి వెళ్లి దొంగలు విలువైన వస్తువులు లేకపోవడంతో పాటు.. వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. ఒంటరిగా ఉంటున్న ప్రమీల ఇటీవల మోకాలు ఆపరేషన్ నిమిత్తం హైదరాబాద్‌లోని కుమారుడి వద్దకు వెళ్లినట్లు సమీప బంధువులు తెలిపరు. ఎస్ఐ శివరామకృష్ణ ఘటనా ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీంను రప్పించి ఆధారాలను సేకరించారు. రెండు ఇళ్లల్లో ఒకే విధంగా తాళాలు పగులగొట్టిన విధానం చూసి, ప్రొఫెషనల్ దుండగుల పని అయి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. గ్రామంలో ఇటీవల దొంగతనాలు పెరుగుతుండడంతో ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

తెనాలి రూరల్, మే16 (ఆంధ్రజ్యోతి): రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటనపై కేసు నమోదు చేసినట్లు రైల్వే పోలీసులు శుక్రవారం తెలిపారు. ఎస్ఐ వెంకటాద్రి వివరాల ప్రకారం.. పట్టణంలోని మల్లెపాడు రైల్వే గేటు సమీపంలో రైల్వే ట్రాక్‌పై సుమారు 35 నుండి 40 ఏళ్ల వయసున్న వ్యక్తి రైలు కింద మృతి చెందాడు. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. మృతదేహాన్ని తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాల మార్చురీకి తరలించి, విచారణ చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడిని గుర్తిస్తే రైల్వే పోలీస్ ఫోను నంబరు 72070 76614 సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు.

చేపల చెరువులో పడి వ్యవసాయ కూలీ మృతి



ఏడుకొండలు (ఫైల్ ఫొటో)

నూజెండ్ల, మే 16 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ కూలీ ప్రమాదవశాత్తు చేపల చెరువులో పడి మృతి చెందిన ఘటన మండలంలోని వీ అప్పాపురం గ్రామంలో గురువారం సాయంత్రం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా ఒంగోలు మండలం శరగానివారిపాలేనికి చెందిన సీహెచ్ ఏడుకొండలు(55) వ్యవసాయ పనులకు వెళ్తూ..చేపలు పడుతుంటాడు. నూజెండ్ల మండలంలోని వీ అప్పాపురం గ్రామంలో చేపలు పట్టేందుకు ముఠాలో కూలీగా వచ్చి ప్రమాదానికి గురయ్యాడు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ బీవీ కృష్ణారావు పరిశీలించారు. శుక్రవారం మృతుడి కొడుకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



వజ్రగిరి కోటమ్మ(ఫైల్ ఫొటో)

నూజెండ్ల, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మృత్యుంజాపురం గ్రామానికి చెందిన వజ్రగిరి కొండమ్మ(45) ప్రకాశం జిల్లా త్రిపురాంతకం మండలం గుట్లపల్లి జాతీయ రహదారి పై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. పుల్లల చెరువు మండలం తోటపాచర్లలో బంధువుల ఇంటికి వెళ్లి వస్తున్న సందర్భంలో ఆమె ప్రయాణిస్తున్న కారు కట్టెల ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కొదముల కుమారి, షారోన్, ప్రశాంత్ రాజుకు గాయాలయ్యాయి.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



పొన్నూరుటౌన్, మే 16: పట్టణంలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం బస్ సెల్టర్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని అర్బన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. గురువారం అర్ధరాత్రి పట్టణంలోని గుంటూరు బస్టాండ్ సెంటర్‌లో ఉన్న సెల్టర్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి.. పోలీసులకు సమాచరం అందించారు. అక్కడికి చేరుకున్న అర్బన్ పోలీసులు వ్యక్తి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతుడు ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చి తిరిగి వెళ్లడానికి బస్‌షెల్టర్ వేచి ఉన్నట్లు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని పంచానామా నిమిత్తం నిడుబ్రోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వ్యవసాయంలో సాంకేతికను వినియోగించాలి

- వీసీ డాక్టర్ శారద జయలక్ష్మీదేవి

లాంఫాం(తాడికొండ)మే 16(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో సాంకేతికను రైతులు సద్వినియోగించుకోవాలని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ శారద జయలక్ష్మీదేవి పేర్కొన్నారు. లాంఫాంలోని ఆచార్య వర్సిటీలో మూడు రోజుల పాటు జరిగిన అటారి జోన్ టెన్ యాన్యువల్ వర్క్‌షాప్, యాక్షన్ ప్లాన్ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం పెరగాలన్నారు. ఏఐ ఆధారిత ఫెర్టిగేషన్, ఇరిగేషన్, అంతర కృషి సాగు చేపట్టాలని సూచించారు. బయోస్టిమ్యూలెంట్స్, హర్మోన్స్ వినియోగం, అగ్రి-హర్టి-టూరిజమ్, టమోటలు, వంకాయ మొక్కల వినియోగం పెరగాలన్నారు. పెరుగుతున్న జనాభిని అంచనావేస్తే తగిన ఆహర పంటలను పండిస్తు ప్రణాళికలు చేయాలని వివరించారు. ఈ కార్యక్రమంలో అటారి డైరెక్టర్ డాక్టర్ ఎస్.ఎన్ మీరా, ఏపీఎస్ఎస్‌సీఏ డైరెక్టర్ డాక్టర్ సతీష్, ఉద్యాన, పశుసంవర్ధక విశ్వవిద్యాలయ అధికారులు, విస్తరణ సంచాలకులు డాక్టర్ శివనారాయణ, డాక్టర్ గోవిందరాజు, డాక్టర్ శోభామణి, కేవీకే, ఏరువాక కేంద్రాల శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.



భవనం నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కమిషనర్ ఎం.వెంకటరామకృష్ణ తేజ

భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలి

- పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ ఎం.వెంకటరామకృష్ణ

గుంటూరు సిటీ, మే16(ఆంధ్రజ్యోతి): నిర్మాణంలో ఉన్న భవనాల త్వరితగతిన పూర్తిచేయాలని పంచాయతీరాజ్ కమిషనర్ ఎం.వెంకటరామకృష్ణ తేజ ఆదేశించారు. శుక్రవారం జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం భవనాన్ని ఆయన గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెని క్రిస్టినాతో కలిసి పరిశీలించారు. జరుగుతున్న పనుల పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు అనంతరం జిల్లా పరిషత్ ప్రాంగణంలోని నూతనంగా ఏర్పాటు చేసిన డీఎల్‌డీఓ కార్యాలయాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో జ్యోతి బస్సు, ఉప ముఖ్యమంత్రి ఓఎస్‌డీ వెంకటకృష్ణ, ఆర్‌డబ్ల్యూ ఎస్ఈ కల్యాణ చక్రవర్తి, డీఈ శివరామకృష్ణ, పంచాయతీరాజ్ ఎస్ఈ బ్రహ్మయ్య, డీడబ్ల్యూఎంఏ పీడీ శంకర్, డీపీఓ సాయికుమార్, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.25 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	248.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	258.00

గుంటూరు సిటీ వార్తలు

• గుంటూరు తూర్పు • పశ్చిమ

ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలి

● అధికారులను ఆదేశించిన కమిషనర్

గుంటూరు కార్పొరేషన్, మే 16 (ఆంధ్రజ్యోతి): రాబోవు మూడు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వాతావరణ శాఖ సూచనల మేరకు నగరంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని, గురువారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి నగరంలో విరిగిన చెట్లను, హోర్డింగ్స్‌ని తొలగించడం, నీరు నిలిచిన ప్రాంతాల్లో బెయిల్ అవుట్‌ను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య అధికారులకు స్పష్టం చేశారు. కమిషనర్ శుక్రవారం మూడు వంతెనలు, అరండల్‌పేట, అమరావతి రోడ్, విద్యా నగర్ మెయిన్ రోడ్, మారుతి నగర్, కంకరగుంట ఆర్‌యూబీ తదితర ప్రాంతాల్లో పర్యటించి సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు తమ ప్రాంతాల్లో తాగు నీటి సమస్యలు, చెట్లు విరిగి ట్రాఫిక్‌కి అడ్డుగా ఉన్నా, వర్షం నీరు నిలిచినా తక్షణం జీఎంసి కాల్ సెంటర్ 0863-2345103, 104, 105 నంబర్లకు కాల్ చేస్తే సత్వర చర్యలు తీసుకుంటామన్నారు. మూడు వంతెనల వద్ద నిలిచిన సిల్ట్‌ని, జెట్టింగ్ మెషిన్ల ద్వారా శుభ్రం చేయాలని, కంకర గుంట ఆర్యుబి వద్ద అదనపు మోటార్లను ఏర్పాటు చేసి నీటిని బెయిల్ అవుట్ చేయాలని డిఈఈని ఆదేశించారు. విద్యుత్ సరఫరా అంతరాయం వలన తాగునీటి సరఫరాకి సమస్య లేకుండా ముందస్తుగా జనరేటర్లు ఏర్పాటు చేసుకోవడం, విద్యుత్ శాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలని ఈఈలను ఆదేశించారు. నగరంలో పలు ప్రాంతాల్లో హోర్డింగ్స్ విరిగి, బ్యానర్లు గాలికి ఎగురుతున్నాయని, ఆయా హోర్డింగ్‌లను తక్షణం తొలగించాలని సిటి ప్లానర్‌ని ఆదేశించారు. అలాగే నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తు భవన యజమానులు వర్షాలకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, శిథిలావస్థలోని పురాతన భవన యజమానులకు నోటీసులు ఇవ్వాలని పట్టణ ప్రణాళికాధికారులను ఆదేశించారు. పర్యటనలో సిఎంఓహెచ్ డాక్టర్ అమృతం, ఈఈ సుందర్రామిరెడ్డి, డీఈఈ మధుసూధన్, ఏఈలు, టీపీఎస్‌లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.



కంకరకుంట వద్ద ఉన్న వర్షపు నీటిని పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

గాలులకు ఆటో బోల్తా... మహిళ మృతి



సామ్రాజ్యం మృతదేహం

గుంటూరు, మే 16 (ఆంధ్రజ్యోతి) : ఈదురు గాలులు, భారీ వర్షానికి ఆటో బోల్తా కొట్టడంతో అందులో ప్రయాణిస్తున్న రూరల్ మండలం జొన్నలగడ్డ గ్రామానికి చెందిన ఇమ్మడి సామ్రాజ్యం (64) మృతి చెందారు. సామ్రాజ్యం ఊరు వెళ్ళేందుకు అదే గ్రామానికి చెందిన ఆటోలో శుక్రవారం వేకువజామున సుమారు 4.30 గంటలకు గుంటూరు రైల్వే స్టేషన్‌కు వెళుతోంది. ఆటో అరండల్‌పేట మెయిన్ రోడ్డు 11వ లైను వద్దకు చేరేసరికి విపరీతమైన వర్షం, ఈదురుగాలులకు ఒక్కసారిగా ఆటో బోల్తా కొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న సామ్రాజ్యం తలకు, కాలుకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే 108లో జీజీహెచ్‌కు తరలించగా ఆమె అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతురాలి భర్త కృష్ణార్జునరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రామనామ క్షేత్రం వద్ద నేల కొరిగిన విద్యుత్ స్తంభం

అదేవిధంగా అరండల్‌పేట ఒకటో లైన్ రైల్వే స్టేషన్ రోడ్డులో వర్షానికి, గాలులకు భారీ వేపచెట్టు నేలకొరగడంతో శుక్రవారం రాకపోకలకు అంతరాయం కలిగింది. కార్పొరేషన్ సిబ్బంది ప్రయత్నించి కూలిన చెట్టును ఎట్టకేలకు తొలగించారు. అలాగే రాత్రి వీచిన గాలికి ఆర్ అగ్రహారం రామనామక్షేత్రం వద్ద విద్యుత్ స్తంభం నేల కొరిగింది. రాత్రి కావడంతో జనసంచారం లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పినట్లయింది. అదేవిధంగా బృందావనగార్డెన్స్ వద్ద కూడా మరో చెట్టుకూలింది.

దేశ ప్రజలను మోసం చేస్తున్న మోదీ

● సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల

గుంటూరు(తూర్పు), మే 16(ఆంధ్రజ్యోతి): తన మాయ మాటలతో ప్రధాని మోదీ దేశ ప్రజలను మోసం చేస్తున్నారని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మండిపడ్డారు. స్థానిక కొత్తపేట, మల్లయ్య లింగం భవన్లో శుక్రవారం జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్ ఆదేశ్వరరావు అధ్యక్షతన జరిగిన జిల్లా కౌన్సిల్ సభ్యుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నరేంద్ర మోదీ మాయమాటలను నమ్మే పరిస్థితులలో ప్రజలు లేరని అన్నారు. మత విద్వేషాలు రగిలిస్తూ అమాయక ప్రజలను మతాల ఉచ్చులోకి లాగి మారణ హోమం సృష్టిస్తున్నారని అన్నారు. రైతులు, నిరుద్యోగ సమస్యలను పరిష్కరించడంలో మోదీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి సీపీఐ మహాసభలు జరుగుతాయని, అందులో భాగంగా సెప్టెంబరు నెలలో చండీఘర్‌లో జాతీయ మహాసభలు జరుగనున్నాయని తెలిపారు. అదేవిధంగా ఆగస్టు 22 నుంచి ఒంగోలులో రాష్ట్ర మహాసభలు జరుగబోతున్నాయని చెప్పారు. అంతకు ముందు మండల, నియోజకవర్గ, జిల్లా మహాసభలు నిర్వహించేందుకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ముప్పాళ్ల నాగేశ్వరరావు, పాల్గొన్న జంగాల అజయ్‌కుమార్ తదితరులు

20న 'శశిరంలో గులాబీలు' పుస్తకావిష్కరణ సభ

గుంటూరు(తూర్పు), మే 16 (ఆంధ్రజ్యోతి) : విద్యావేత్త, రాజనీతిజ్ఞుడు అయిన ఎంసి చాగ్ల జీవిత విశేషాలను తెలియజేసే ఆత్మకథ 'శిశిరంలో గులాబీలు' పుస్తకావిష్కరణ సభ ఈనెల 20వ తేదీ సాయంత్రం 6 గంటలకు స్థానిక లక్ష్మీపురం ఆంధ్రప్రదేశ్ కాటన్ అసోసియేషన్ సమావేశ మందిరంలో జరుగుతుందని జయ చాముండేశ్వరి పబ్లికేషన్స్ నిర్వాహకులు కె.జయలక్ష్మి, చాముండేశ్వరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రముఖ తెలుగు అనువాదకులు కందిమళ్ల శివప్రసాద్ రాసిన ఈ పుస్తక పరిచయ సభకు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ అధ్యక్షత వహిస్తారని, గ్రంథావిష్కరణ అన్నమయ్య గ్రంథాలయ వ్యవస్థాపకులు లంక సూర్యనారాయణ గావిస్తారని చెప్పారు.

ఆయుర్వేదం, యోగాపై రేపు ఆరోగ్యసభ

గుంటూరు, మే 16(ఆంధ్రజ్యోతి) : ఆయుర్వేదం, యోగా, ధ్యానంపై అరండల్‌పేట 15/1వ లైను లోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం ఆరోగ్యసభ నిర్వహించనున్నట్లు సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ నాగేంద్ర, సీనియర్ యోగాచార్యులు ప్రొఫెసర్ గుంటుపల్లి సాంబశివరావులు సలహాలు, సూచనలు చేస్తారన్నారు.



మస్తాన్‌దర్గా వెనుక ఇళ్ళ ముందు మురుగును తొలగిస్తున్న మహిళ



రొచ్చుగా మారిన చుట్టుగుంట శాంతినగర్ మూడో లైను

గాలివాన బీభత్సం.. లోతట్టు ప్రాంతాలు జలమయం

● కాలనీల్లో సీసీ రోడ్లపైకి చేరిన బురద, వ్యర్థాలు

గుంటూరు, మే 16(ఆంధ్రజ్యోతి) : గాలివాన బీభత్సంతో నగరంలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గురువారం అర్ధరాత్రి కురిసిన వర్షంతో నీటితో పాటు వ్యర్థాలు, బురద రహదారులపైకి చేరి రొచ్చు రొచ్చుగా మారాయి. నగరంతో పాటు శివారు కాలనీల్లోని లోతట్టు ప్రాంతాలు వర్షపునీరు, మురుగునీరు తోడై చిన్నపాటి చెరువులను తలపిస్తున్నాయి. వర్షపునీటికి మురుగునీరు తోడవటంతో దుర్వాసనతో ప్రజలు అల్లాడుతున్నారు. నగరంలోని పాతగుంటూరు శివారు, అమరావతి రోడ్డులోని శివారు, నల్లపాడు రోడ్డులోని శివారు కాలనీల్లో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధాన ప్రాంతాల్లో వర్షపునీరు ఎక్కడికక్కడ డ్రెయిన్స్ ద్వారా వెళ్ళిపోయినప్పటికీ లోతట్టు ప్రాంతాల్లో నీరు చెరువులను తలపిస్తున్నాయి. కాలనీల్లో ప్రజలు ఇళ్ళ ముంగిట బురదను తొలగించుకునే పనిలో నిమగ్నమయ్యారు.


పలు ప్రాంతాల్లో నేలకొరిగిన విద్యుత్‌పోల్స్

● రెండు ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం



విద్యుత్ పునరుద్ధరణ పనులను పరిశీలిస్తున్న ఈఈ శ్రీనివాసబాబు తదితరులు

గుంటూరు, మే 16(ఆంధ్రజ్యోతి): గురువారం అర్ధరాత్రి దాటిన తరువాత నగరంలో గాలివానా దుమారంతో విద్యుత్ సరఫరా అస్తవ్యస్తంగా మారింది. ఉరుములతో కూడిన వర్షం జోరున కురవటంతో సుమారుగా తెల్లవారుజామున మూడు గంటల ప్రాంతంలో విద్యుత్‌సరఫరా ఎక్కడికక్కడ నిలిచిపోయింది. ఈదురుగాలులకు పలు ప్రాంతాల్లో విద్యుత్ పోల్స్ నేలకొరిగాయి. ముఖ్యంగా నగరంలో గుజ్జనగుండ్ల, బ్రాడీపేట, బృందావన్‌గార్డెన్స్, అరండల్‌పేట ప్రాంతాల్లో విద్యుత్‌పోల్స్ నేలకొరిగాయి. చెట్ల కొమ్మలు పడి విద్యుత్ తీగెలు తెగి విద్యుత్ సరఫరా అస్తవ్యస్తంగా మారింది. బృందావన్‌గార్డెన్స్‌లోని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కార్యాలయం ఎదుటనే భారీ వృక్షం నేలకొరిగి విద్యుత్ పోల్ పడిపోయి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఇక పాతగుంటూరు, నల్లచెరువు, శ్రీనివాసరావుపేట, అమరావతి రోడ్డు, నల్లపాడు రోడ్డు, ఎస్‌వీఎన్ కాలనీ, చుట్టుగుంట పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గుంటూరు టౌన్-1 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి.శ్రీనివాస బాబు నేతృత్వంలో ఉదయానికి విద్యుత్ పునరుద్ధరణ పనులకు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. ప్రత్యేక యంత్రాలతో ధ్వంసమైన విద్యుత్ పోల్స్‌ను తొలగించి వాటి స్థానంలో కొత్త పోల్స్‌ను ఏర్పాటు చేశారు. తెగిపడిన విద్యుత్ తీగెల స్థానంలో కొత్త తీగెలను ఏర్పాటు చేసి సరఫరా పునరుద్ధరణ పనులు చేపట్టారు. మొత్తానికి ఆపరేషన్‌సిబ్బందితో శుక్రవారం సాయంత్రం వరకు విద్యుత్‌పునరుద్ధరణ పనులు కొనసాగుతూనే ఉన్నాయి.



గుజ్జనగుండ్ల వద్ద నేలకొరిగిన విద్యుత్ పోల్

రూ. 10 లక్షల నష్టంగా అంచనా....

వర్షంతో విద్యుత్‌శాఖకు రూ.10 లక్షల నష్టంగా అంచనా వేస్తున్నట్లు గుంటూరు టౌన్-1 ఆపరేషన్ ఈఈ శ్రీనివాసబాబు తెలిపారు. రెండు ప్రాంతాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు (డీటీఆర్) దెబ్బతినటంతో పాటు విద్యుత్ పోల్స్ దెబ్బతిని నష్టం వాటిల్లిందన్నారు. ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపి యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టామని ఈఈ పేర్కొన్నారు.

ఆకుపచ్చ పట్టాల రూపంలో రూ.లక్షల నష్టం

నగరపాలక సంస్థ ముందుచూపు లేకుండా ఆకుపచ్చ పట్టాలను పలుచోట్ల ఏర్పాటు చేసింది. సిగ్నల్ లైట్ల వద్ద ఎండ వేడిమిలో ప్రజలు ఇబ్బందిపడకూడదని ఆకుపచ్చ పట్టాలను పైన కట్టింది. గాలివానకు అవి ఎక్కడికక్కడ చిరిగిపోయాయి. రోడ్లపై ఏర్పాటు చేసిన ఐరన్ పోల్స్ కూలిపోయాయి. అలానే రోడ్లపై చెత్త వేయొద్దంటూ నగరమంతటా ఏర్పాటు చేసిన పచ్చ పట్టాలు కూడా కిందపడి ఎందుకు పనికి రాకుండా పోయాయి. దీని వలన రూ. లక్షల్లో నష్టం వాటిల్లింది. అసలు ఈ ఆలోచన నగరపాలకసంస్థకు ఎవరు ఇచ్చారన్న ప్రశ్నలు ఉత్పన్నమౌతున్నాయి.



ఏటి అగ్రహారంలో రోడ్డుపైనే మురుగునీరు



అరండల్ పేట ఓవర్ బ్రిడ్జి కింద చేరిన బురద



అరండల్‌పేటలో షాపుల ముందు తెగిపోయిన కరెంటు తీగలు



షాపుల ముందు నిలిచిపోయిన వర్షపు నీరు



పట్టాభిపురంలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు



ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లే దారిలోని ఓవర్ బ్రిడ్జి కింద నిలిచిన వర్షపు నీరు



జోసఫ్‌నగర్‌లోని మినీ సిటిజన్ రిసోర్స్ సెంటర్లో నిలిచిన వర్షపు నీరు



గాలి వానకు చినిగిపోయిన ఫ్లెక్సీలు



పట్టాభిపురంలోని రైల్వే డీఆర్ఎం ఆఫీస్ ముందు నిలిచిన మురుగునీరు

డిజిటల్ లైబ్రరీగా ప్రాంతీయ గ్రంథాలయం

● తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు(తూర్పు), మే 16 (ఆంధ్రజ్యోతి) : ఎంపీ, ఇతర నిధులతో ప్రాంతీయ గ్రంథాలయాన్ని డిజిటల్ లైబ్రరీగా మారుస్తామని తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ అన్నారు. ప్రాంతీయ గ్రంథాలయానికి లైబ్రరీ ఓల్డ్ ఫ్రెండ్స్ అసోసియేషన్ వారు శుక్రవారం రూ.2.50 లక్షల విలువ చేసే కుర్చీలు, ప్యాడ్లు, వాటర్ ప్యూరిఫైర్స్‌ను అందించారు. ఈ కార్యక్రమానికి గ్రంథాలయ సంస్థ రాష్ట్ర చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావుతో కలిసి ఆయన హాజరై మాట్లాడారు. లైబ్రరీ ఓల్డ్ ఫ్రెండ్స్ తీసుకున్న ఈ నిర్ణయం రాబోయే తరానికి ఆదర్శంగా మారుతుందని తెలిపారు. రాష్ట్ర గ్రంథాలయంలో చదువుకున్న అనేక మంది గొప్ప స్థాయిలో నిలిచారని చెప్పారు. ఇదే లైబ్రరీలో తాను కూడా చదువుకున్నానని గుర్తు చేసుకున్నారు. గతంలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసానితో కలిసి గ్రంథాలయాన్ని సందర్శించామని, సీఎస్ఆర్ ఫండ్స్ ద్వారా అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించామని చెప్పారు. ఇదే లైబ్రరీలో లైబ్రేరియన్‌గా విధులు నిర్వహించిన అచ్చమాంబ.. ఇదే గ్రంథాలయానికి సేవ చేయాలని రావడం అభినందనీయమన్నారు. గోనుగుంట్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ గ్రంథాలయాలు ఇకపై పుస్తకాలకే పరిమితం కాకుండా డిజిటలైజేషన్ వైపు ప్రయత్నిస్తామని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం, సీఎస్ఆర్, రాష్ట్ర ప్రభుత్వ నిధులు కలిపి రూ.8 కోట్లతో గ్రంథాలయాన్ని అభివృద్ధి చేయబోతున్నామని చెప్పారు. కార్యక్రమానికి అసోసియేషన్ అధ్యక్షుడు గుర్రం మురళి అధ్యక్షత వహించగా కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సుబ్బరత్నమ్మ, గ్రంథాలయ అధికారి ఎన్.వెంకటేశ్వరరావు, పూల శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్, పాల్గొన్న గోనుగుంట్ల కోటేశ్వరరావు తదితరులు

దొంగతనాలకు పాల్పడుతోన్న ఐదుగురు అరెస్టు

● రూ.3.20 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం

గుంటూరు, మే 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా వివిధ దేవాలయా ల్లో దొంగతనాలకు పాల్పడుతోన్న ఐదుగురు సభ్యుల దొంగల ముఠాను నల్లపాడు పోలీసులు అరెస్ట్ చేసారు. వారి వద్ద నుంచి రూ.3 లక్షల 20 వేల ఖరీదైన ఆభరణాలు స్వాదీనం చేసుకున్నారు. ఈ మేరకు శుక్రవారం నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో సౌత్ డీఎస్పీ భానోదయ, నల్లపాడు సీఐ వంశీధర్ వివరాలు వెల్లడించారు. డీఎస్పీ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గత మార్చి 3న ఓబులనాయుడు పాలెం గ్రామంలో గల శ్రీ సీతారామ భద్రాద్రి స్వామి దేవాలయం తాళాలు పగులగొట్టి నార్సింగ్ గంగాధర్, నార్సింగ్ మహేష్, కారంపూడి విజయ్ కుమార్, పుట్టా వెంకటేష్, వేమవరపు విద్యాసాగర్ వెండి, బంగారపు వస్తువులు, హుండీలోని డబ్బులు అపహరించుకుపోయారు. వారిని విచారించగా నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఈ ఆలయ దొంగతనంతో పాటు పెదకాకాని పోలీస్ స్టేషన్ పరిధిలోని అనమర్లపూడి గ్రామంలోని చమల్లమ్మ తల్లి దేవాలయంలో జరిగిన దొంగతనం, తెనాలి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కాజీపేట గ్రామంలో గల శ్రీ లక్ష్మి మైసమ్మ దేవాలయంలో జరిగిన దొంగతనాలను వీరే చేసినట్లు అంగీకరించారు. వీరు ఎక్కువగా బంగారు, వెండి ఆభరణాలు ఉన్న దేవాలయాలను టార్గెట్ గా చేసుకొని దొంగతనాలకు పాల్పడుతుంటారన్నారు. పగటి పూట రెక్కీ చేసి, రాత్రి పూట దొంగతన చేస్తారని విచారణలో తేలిందన్నారు.



వివరాలు వెల్లడిస్తోన్న సౌత్ డీఎస్పీ భానోదయ, సీఐలు వంశీధర్, సుబ్బారావు, వెనుక నిందితులు, సిబ్బంది

జైలులో పరిచయంతో ముఠాగా...

నార్సింగ్ గంగాధర్, నార్సింగ్ మహేష్ అనే ఇద్దరు అన్నదమ్ములు. వీరు తెలంగాణా రాష్ట్రం మిర్యాలగూడ మండలం గోగువారిగూడెం గ్రామ నివాసులు. వీరు గతంలో చేసిన దొంగతనాలకు వీరిని పోలీసులు అరెస్టు చేసి గుంటూరు జిల్లా జైలుకు పంపారు. అక్కడ వీరికి ప్రస్తుతం గుంటూరు లో నివాసం ఉండే రేపల్లెకు చెందిన కారంపూడి విజయ్ కుమార్ పరిచయ మయ్యాడు. తదుపరి వారి ముగ్గురిని నరసరావుపేట జిల్లా జైలుకు మార్చా రు. అక్కడ వారికి రేపల్లెలో నివాసం ఉండే పుట్టా వెంకటేష్, అదేవిధంగా పల్నాడు జిల్లా పెదకూరపాడు మండలం 75 తాళ్ళూరు గ్రామానికి చెందిన వేమవరపు విద్యాసాగర్ పరిచయమై స్నేహితులయ్యారన్నారు. ఈక్రమంలో జైలు నుంచి విడుదల అయిన తర్వాత ఐదుగురూ కలసి నేరాలు ప్రారంభిం చారని చెప్పారు. నిందితులను తక్కువ సమయంలో పట్టుకోవటంలో కృషి చేసిన నల్లపాడు పోలీస్ స్టేషన్ సీఐ కె.వంశీధర్, హెడ్ కానిస్టేబుల్ సుబ్బారావు, ఇతర సిబ్బంది, సీసీఎస్ సీఐ ఎంవీ సుబ్బారావు, వారి సిబ్బంది అయిన ఏఎస్ఐలు రామకృష్ణ, వి.ప్రసాద్, హెడ్ కానిస్టేబుళ్ళు పీటర్‌రాజు, వి.కృష్ణప్రసాద్, కానిస్టేబుల్ బి.వెంకటరావు, హోంగార్డు వీరయ్యలను ఎస్పీ అభినందించి, రివార్డులు ప్రకటించారు. వీరికి దిశా నిర్దేశం చేసిన సౌత్ డీఎస్పీ భానోదయను ఎస్పీ అభినందించారు.

రోకలి బండతో దాడి

గుంటూరు, మే 16 (ఆంధ్రజ్యోతి) : శుభ కార్యం వద్ద జరిగిన గొడవను మనసులో పెట్టుకుని ఓ వ్యక్తిపై రోకలి బండతో దాడి చేసి తీవ్రంగా గాయపరచిన ఘటన నగరంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీనివాసరావుతోటకు చెందిన ఇర్ఫాన్ గురువారం రాత్రి కుటుంబ సభ్యులతో కలసి మిర్చియార్డు సమీపంలోని కొత్తకాలనీలో ఓ శుభకార్యానికి వెళ్ళారు. అక్కడ భోజనం చేస్తుండగా చికెన్ వేయమని అడిగాడు. ఈ విషయమై పక్కన కూర్చున్న అదే కాలనీకి చెందిన సమ్మద్ జోక్యం చేసుకుని వ్యంగ్యంగా మాట్లాడాడు. దీంతో ఇరువురి మధ్య గొడవ జరిగింది. బంధువులు ఇరువురికి సర్దిచెప్పి పంపారు. ఇర్ఫాన్ ఇంటికి వచ్చి అరుగు మీద కూర్చుని ఉండగా అక్కడకు వచ్చిన సమ్మద్ గొడవ పెట్టుకుని రోకలిబండతో దాడి చేసి కొట్టాడు. దీంతో ఇర్ఫాన్‌కు తీవ్ర గాయాలు కావడంతో జీజీహెచ్‌కు తరలించారు. ఆయన ఫిర్యాదు మేరకు నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆకట్టుకున్న ఉత్తర గోగ్రహణం తోలుబొమ్మలాట

గుంటూరు(తూర్పు), మే 16 (ఆంధ్రజ్యోతి) : స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై శుక్రవారం గుళ్ళపల్లి సుబ్బారావు సేవాసంస్థ, గుంటూరు వారి సౌజన్యంతో శ్రీ షిరిడిసాయి తోలుబొమ్మలాట బృందం, నరసరావుపేట వారిచే తెలుగువారి ప్రాచీన కళారూపం ఉత్తర గోగ్రహణం తోలుబొమ్మలాట కార్యక్రమం జరిగింది. తొలుత కార్యక్రమాన్ని ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. దుర్గారావు, సత్యనారాయణ, కుమారి, కోటేశ్వరి, చిన్న, బ్రహ్మం, వెంకట దాసు, గణేష్, కార్తికేయ, కమల్ బృందం పాండవుల అజ్ఞాతవాసం, ఉత్తరకుమారుని ప్రజ్ఞలు, ఉత్తర గోగ్రహణము చేసిన కౌరవులను అర్జునుడు ఒక్కడే ఓడించడం ఘట్టాలను పద్యాలు, గేయాలు, వచనంతో అద్భుతంగా ప్రదర్శించి ప్రేక్షకుల ప్రశంసలను చూరగొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, మే 16 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ లైన్‌ల నిర్వహణలో భాగంగా శనివారం జేకేసీ కళాశాల రోడ్డు, విజయపురికాలనీ, తారకరామనగర్, గుజ్జనగుండ్ల, ఎస్‌వీఎన్ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు.

మత్స్య కేంద్రం

లక్ష్యం నెరవేరని.. మత్స్యకేంద్రం!

● విజయపురిసౌత్‌లో నామమాత్రంగా చేప పిల్లల ఉత్పత్తి

● జీవనోపాధి కోల్పోతున్న మత్స్యకారులు



మాచర్ల టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): మత్స్య సంపదను అభివృద్ధి చేసి, మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపాలనే ప్రభుత్వ లక్ష్యం నాగార్జున సాగర్ (విజయపురిసౌత్)లో నెరవేరడం లేదు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నాగార్జున సాగర్ మత్స్యకేంద్రం అభివృద్ధికి మత్స్యశాఖ నుంచి రూ. 1.50 కోట్ల నిధులు మంజూరయ్యాయి.అయితే.. వైసీపీ నేతలు కమీషన్ల కోసం మత్స్యకేంద్రం అభివృద్ధి ముందుకు సాగకుండా అడ్డుతగిలారు. దీంతో అభివృద్ధి నిలిచిపోయింది. నాగార్జున సాగర్ విజయపురిసౌత్‌లో మత్స్య కేంద్రంను సుమారు 32 ఎకరాలలో 1957లో ఏర్పాటు చేశారు. 150 టన్నుల వరకు చేపలను నిల్వ చేయడానికి శీతల గిడ్డంగిని నిర్మించారు. స్పాన్ ద్వారా చేప పిల్లలను ఉత్పత్తి చేయడానికి 26 సిమెంట్ తొట్టిలు, అందులో చేపలను పెంచడానికి 30 మట్టి తొట్టిలు నిర్మించారు. సుమారు 80 లక్షల నుంచి కోటి వరకు చేప పిల్లలను పెంచడానికి కావాల్సిన అన్ని వసతులు ఇక్కడ ఉన్నాయి. మత్స్యశాఖాధికారులు సిబ్బంది నివసించడానికి పక్కా గృహాలు ఏర్పాటు చేశారు. మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయం ఇక్కడే ఉంది. జలాశయంపై ఆధారపడి 650 కుటుంబాల మత్స్యకారులు నివసిస్తూ.. రోజుకు 150 టన్నుల వరకు చేపలను పట్టేవారు. వీటిని పలు రాష్ట్రాలకు ఎగుమతి చేసేవారు. ఇక్కడ పనిచేస్తున్న కొంతమంది సిబ్బందిని ప్రభుత్వం బదిలీపై పంపింది. 1996లో అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయాన్ని జిల్లా కేంద్రానికి మార్చారు. ఆ తరువాత మరికొంత మంది సిబ్బందిని కాకినాడ, విశాఖపట్నం, హైదరాబాద్ వంటి ప్రదేశాలకు బదిలీ చేశారు. క్రమేణా ప్రయోగశాల మూతపడింది. ఐస్ ఫ్యాక్టరీని నిరుపయోగంగా మార్చారు. సుమారు పదేళ్లపాటు మూసివేశారు.

తిరిగి ప్రారంభమై..

అనంతరం మత్స్యకేంద్రం ప్రారంభమైంది. ప్రస్తుతం మత్స్య కేంద్రంలో ఒక అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్, ఇద్దరు ఫీల్డ్ మెన్‌లు, ఒక ఫిషర్‌మెన్ విధులు నిర్వహిస్తున్నారు. 12 తొట్లలో చేప పిల్లలను పెంచుతున్నారు. ఇక్కడ ఏటా 4 లక్షల చేప పిల్లలను పెంచి, సాగర్ జలాశయంలో విడుదల చేస్తున్నారు. చేప సీడ్‌ను కూచిపూడి, కైకలూరు ప్రాంతాల నుంచి తీసుకొస్తున్నారు. నాగార్జున సాగర్ దిగువ కృష్ణానది అతి సమీపంలో ఉన్నప్పటికీ మోటారు బోరు నీటిపైనే మత్స్య సంపద పెంచుతున్నారు. తరచూ నీటి తొట్లు, మోటార్లు రిపేర్లు అవుతున్నా మరమ్మతులు చేయకుండా నిర్లక్ష్యం చూపుతున్నారు. చేపపిల్ల పెంపక కేంద్రం ఆవరణ మొత్తం చిట్టడవిని తలపించేలా ఉండడం పరిశీలిస్తే నిర్వహణ ఎలా ఉందో ఇట్టే అర్థమవుతుంది. సుమారు 30 ఎకరాల ఈ మత్స్యకేంద్రంలో చేప పిల్లల పెంపకంతోపాటుగా.. చేపల చెరువును ఏర్పాటు చేసి స్థానిక మత్స్యకారుల సంఘానికి లీజుకు ఇవ్వాలని మత్స్యకారుల సంఘం నాయకులు పలుమార్లు ప్రభుత్వానికి విన్నవించుకున్నా ఆచరణకు నోచుకోలేదు.

నాడు చేతులు దులుపుకుని..

నాగార్జున సాగర్ జలాశయంలో ప్రతి ఏటా కోటి 50 లక్షల వరకు చేప పిల్లలను విడుదల చేస్తే మత్స్యకారుల జీవనానికి దోహదపడుతుంది. కానీ, గత వైసీపీ ప్రభుత్వంలో అరకొరగా చేప పిల్లలను విడుదల చేసి చేతులు దులుపుకున్నారు. కూటమి ప్రభుత్వంలో గత 11 నెలల్లో మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యాన 30 లక్షల చేప పిల్లలను సాగర్ జలాశయంలో విడుదల చేశారు. స్థానిక మత్స్యకేంద్రం పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తే చేప పిల్లల పెంపుదల గణనీయంగా పెరుగుతుంది.

ప్రభుత్వం ప్రోత్సాహం అందించాలి



ఇక్కడ 650 మత్స్యకార కుటుంబాలు చేపల వేటపైనే జీవనం సాగిస్తున్నాయి. ఏటా చేప పిల్లలను విడుదల చేసున్నారు. కానీ, అలు (జీరోసైజు) వలలతో చేపల వేట చేయడంతో మత్స్య సంపద హరించుకుపోతోంది. ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. సముద్ర ప్రాంతంలో జాలర్లకు ఇచ్చినట్లు మాకూ ప్రోత్సాహం ప్రభుత్వం ఇవ్వాలి.

- మైలపల్లి అప్పలరాజు, మత్స్యకారుడు

మత్స్య సంపద పెంచేలా కృషి చేయాలి



నాగార్జున సాగర్ మత్స్య కేంద్రంలో మత్స్య సంపదను పెంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. మత్స్య కేంద్రంలో చేపల చెరువును ఏర్పాటు చేసి మత్సకారుల సంఘానికి లీజుకు ఇవ్వాలి. ఏటా సాగర్ జలాశయంలో 1.50 కోట్ల చేప పిల్లలను విడుదల చేయాలి. మత్స్యకారులకు వలలు, రుణాలు, మోటారు సైకిళ్ల ప్రభుత్వం మంజూరు చేయాలి.

- ఎరిపల్లి వెంకటేశ్వర్లు, మాజీ అధ్యక్షుడు, మత్స్యకారుల సంఘం



చేప పిల్లలను పెంచే సిమెంట్ తొట్టెలు



ముళ్ల కంపతో కుచించుకుపోయిన మత్స్య కేంద్రం

ఆర్టీసీలో..

● త్వరలో ఆర్టీసీ ఇన్‌బస్ పార్శిల్ బుకింగ్ సర్వీస్

● నేరుగా కండక్టర్ వద్దే బుక్ చేసుకోవచ్చు..

కొరియర్ సేవలు సులభతరం



గుంటూరు, మే 16(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ త్వరలో ఇన్ బస్ పార్శిల్ బుకింగ్ సర్వీస్‌ను ప్రారంభించనుంది. ఇప్పటి వరకు ఆర్టీసీ కార్గో పార్శిల్ బుకింగ్ కేంద్రంలోనే ఈ సదుపాయం ఉంది. ఇకపై బస్‌లో కండక్టర్ వద్దనే పార్శిల్ బుకింగ్ చేసుకోవచ్చు. ఈ మేరకు ఆర్టీసీ యంత్రాంగం ఇన్‌బస్ పార్శిల్ బుకింగ్ సర్వీస్‌పై ప్రచారం చేస్తోంది. త్వరలోనే అందుబాటులోకి తీసుకొచ్చేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటి వరకు ఆర్టీసీలో వస్తువులు, కొరియర్‌లకు బస్టాండ్ ఆవరణతో పాటు ఆర్టీసీ ఆథరైజ్డ్ డీలర్స్ వద్ద మాత్రమే బుకింగ్ సదుపాయం ఉంది. ఇక అలా కాకుండా విలువైన పత్రాలైనా, ఏవైనా వస్తువులను బస్సును ఆపి కండక్టర్ వద్దే పార్శిల్ బుకింగ్ చేసుకొని, గమ్య స్థానాలకు చేర్చుకోవచ్చు. 250 గ్రాముల లోపు నుంచి 5 కేజీల వరకు బుకింగ్ చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. కొరియర్ 250 గ్రాముల వరకు డెలివరీ చార్జి రూ. 80, ఆపై 5 కేజీల వరకు రూ.140లుగా నిర్ణయించినట్లు వెల్లడించారు. బుకింగ్ సమయంలో బుకింగ్ చేసేవారి, గమ్య స్థానంలో పార్శిల్ తీసుకునే వారి ఫోన్ నంబర్లను ఇవ్వాల్సి ఉంటుంది. అనంతరం తగిన రశీలు పొందవచ్చు. కొరియర్‌లో వస్తువులు నమ్మకంగా గమ్యస్థానాలకు చేరుతాయని అధికారులు భరోసా ఇస్తున్నారు. ఇన్ బస్ పార్శిల్ బుకింగ్ సర్వీస్‌పై ఆర్టీసీ యంత్రాంగం ప్రచారానికి శ్రీకారం చుట్టింది. ఇప్పటికే బస్సుల్లో ప్రచారం ప్రారంభించింది. ప్రజలు ఆర్టీసీ ప్రవేశపెట్టిన కొత్త పార్శిల్ సర్వీసును సద్వినియోగం చేసుకోవాలని అవగాహన కల్పిస్తోంది.

తెలుగు రాష్ట్రాల స్థాయి

నాటిక పోటీలు ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ జయమ్మ

చిలకలూరిపేట, మే16 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట సీఆర్ క్లబ్, చిలకలూరిపేట కళాపరిషత్‌ల సంయుక్త ఆధ్వర్యంలో మూడు రోజులపాటు జరిగే తెలుగు రాష్ట్రాల స్థాయి 9వ ఆహ్వాన నాటిక పోటీలు స్థానిక సీఆర్ క్లబ్ ఓపెన్ థియేటర్‌లో శుక్రవారం రాత్రి ప్రారంభమయ్యాయి. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కందిమళ్ల జయమ్మ జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. తొలి రోజున జరిగిన కార్యక్రమంలో సీఆర్ క్లబ్ ఉపాధ్యక్షుడు చెరుకూరి కాంతయ్య, సీనియర్ కళాకారులు మల్లాది శివన్నారాయణ, కందిమళ్ల నారాయణమూర్తి, జరుగుల రామారావు, ఇంకా జమాల్ బాషా, డాక్టర్ ప్రత్తిపాటి ప్రఫుల్లాదేవి, గోరంట్ల నారాయణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం హైదరాబాద్ కళాంజలి వారి రైతే రాజు, చిలకలూరిపేట మద్దుకూరి ఆర్ట్ క్రియేషన్ వారి మా ఇంట్లో మహాభారతం, విజయవాడ మైత్రి కళానిలయం వారి బ్రహ్మ స్వరూపం నాటికలు ప్రదర్శించారు.

ఈ విగ్రహాల.. విలువెంతో..!

● కోర్టు ఆదేశాలతో కదిలిన పురావస్తుశాఖాధికారులు

● రైతు పొలంలో లభించిన విగ్రహాల పరిశీలన

● విలువ లెక్కగట్టే పనిలో రీజినల్ డైరెక్టర్ ఎన్‌కే పాఠక్ బృందం



పొలంలో లభించిన విగ్రహాలు



పురావస్తు శాఖ రీజినల్ డైరెక్టర్ ఎన్‌కే పాఠక్, సిబ్బంది

బాపట్ల, మే 16 (ఆంధ్రజ్యోతి): కోర్టు ఆదేశాలతో పురావస్తుశాఖాధికారులు తరలి వచ్చారు. రైతు పొలంలో లభించిన విగ్రహాలను ఎట్టకేలకు పరిశీలించారు. బాపట్ల జిల్లాలోని పిట్టలవానిపాలెం మండలం చందోలు గ్రామానికి చెందిన రైతు ఎండీ అన్వర్ ఆలీ అన్సారి పొలం మరమ్మతులు చేస్తుండగా 2003లో విలువైన 4 విగ్రహాలు, పూజా సామగ్రి బయటపడ్డాయి. వీటిని సదరు రైతు చందోలు పోలీసులకు అప్పగించారు. పోలీసులు వాటిని అధికారుల పర్యవేక్షణలో బాపట్ల సబ్ ట్రెజరీ కార్యాలయంలో డిపాజిట్ చేశారు. అయితే, రైతు అన్వర్ ఆలీ అన్సారి విగ్రహాల విలువలో తనకు వాటా కావాలని 2014లో హైకోర్టును ఆశ్రయించారు. 2023లో విగ్రహాల విలువ లెక్కకట్టమని కోర్టు ఉత్తర్వులు జారీ చే సింది. అయినప్పటికి పురావస్తు శాఖాధికారులు పట్టించుకోలేదు. రైతు తరుపున హైకోర్టు న్యాయవాది కె.జోసఫ్ కోర్టు ధిక్కరణ కేసు వేశారు. దీంతో పురావస్తుశాఖాధికారులు స్పందించారు. బెంగళూరులోని దక్షిణ భారతదేశ పురావస్తుశాఖ రీజినల్ డైరెక్టర్ ఎన్‌కే పాఠక్ బృందం శుక్రవారం బాపట్ల తహసీల్దార్ కార్యాలయానికి విచ్చేశారు. స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి సబ్ ట్రెజరీ కార్యాలయంలో డిపాజిట్ చేసిన విగ్రహాలను తీసుకొచ్చి పరిశీలించారు. బరువు, విలువను లెక్క కట్టారు. నివేదికను కోర్టుకు సమర్పించనున్నట్లు తెలిసింది. డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్, ఆర్డీఓ పి. గ్లోరియా, బాపట్ల, పిట్టలవానిపాలెం తహసీల్దార్లు షేక్.సలీమా, డి. వెంకటేశ్వరరావు, దేవ దాయ, రెవెన్యూశాఖాధికారులు పాల్గొన్నారు.

లభించిన విగ్రహాలు

రైతు ఆలీ అన్సారీ పొలంలో శ్రీ విష్ణు, శ్రీమహా విష్ణు, శ్రీలక్ష్మీ, నటరాజస్వామి విగ్రహాలు బయటపడ్డాయి. వాటితోపాటు పూజా సామగ్రి ఇతర వస్తువులున్నాయి. ఈ విగ్రహాలు 14వ శతాబ్దానికి పూర్వానివిగా స్థానికులు అభిప్రాయపడుతున్నారు. అయితే అధికారులు మాత్రం దీనిని ధ్రువీకరించేందుకు అంగీకరించలేదు.

వాటా కావాలి



విగ్రహాలు మా భూమిలో దొరికాయి. కాబట్టి వాటి విలువలో వాటా ఇవ్వాలి. గతంలో వాటి బరువు సుమారు 57 కిలోలు ఉంది. విలువలో 20 శాతం రైతుకు ఇవ్వాలని జీఓ ఉంది. కేరళలో ఇలా దొరికితే వాటి విలువ మొత్తం రైతుకే చెందుతుందని ఉంది. వీటికి సంబంధించిన జీవోలను కోర్టులో సమర్పించాం.

-ఎండీ అన్వర్ ఆలీ అన్సారీ, రైతు

నివేదిక మేరకు ప్రభుత్వం చర్యలు



హైకోర్టు ఆదేశాల మేరకు పురావస్తుశాఖాధికారులు బాపట్ల వచ్చి ట్రెజరీలో డిపాజిట్ చేసిన విగ్రహాలను పరిశీలించారు. వారు నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి అందజేస్తారు. దాని ప్రకారం ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

- జి.గంగాధర్‌గౌడ్, జిల్లా రెవెన్యూ అధికారి

భూముల రీ సర్వేలో మన విధానం భేష్

● తమ రాష్ట్రాల్లో అమలు చేస్తామన్న ప్రతినిధులు ● రెండు రోజుల జాతీయ కార్యశాల నిర్వహణతో గుంటూరుకు ఖ్యాతి

● కేంద్ర మంత్రి పెమ్మసాని, జిల్లా యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపిన ప్రభుత్వం



భూ రికార్డుల డిజిటలైజేషన్‌పై రెండు రోజుల కార్యశాల ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

గుంటూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): భూముల సర్వే/రీసర్వే విధానం ఇక్కడ చాలా పకడ్బందీగా జరుగుతోందని, గ్రౌండ్ ట్రూతింగ్, భూమి రికార్డుల స్వచ్ఛీకరణ, డ్రోన్ ఫ్లయింగ్, జియో కో-ఆర్డినేట్స్, అధిక స్పష్టత కలిగిన శాటిలైట్ చిత్రాలు, గ్రీవియన్స్ స్వీకరణ, వాటి పరిష్కారానికి ఏర్పాటు చేసిన యంత్రాంగాలు చాలా భేషుగ్గా ఉన్నాయని కేంద్ర ప్రభుత్వ భూమి రికార్డుల శాఖతో పాటు సర్వే ఆఫ్ ఇండియా, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతినిధులు ప్రశంసించారు. డిజిటల్ ఇండియా ల్యాండ్ రికార్డ్స్ మోడర్‌నైజేషన్ ప్రోగ్రాం కింద గుంటూరు నగరంలోని ఐటీసీ వెల్‌కం హోటల్‌లో రెండు రోజుల పాటు జరిగిన జాతీయ కార్యశాల శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా రీసర్వేలో మనం అవలంబిస్తున్న విధానాలను తెలుసుకొనేందుకు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన అధికారులు ఎంతో ఆసక్తి కనబరిచారు. తొలి రోజున వట్టిచెరుకూరులోని అనంతవరప్పాడులో జరిగిన ఫీల్డ్ విజిట్‌లోనూ అనేక అంశాలను తెలుసుకొన్నామని వారు చెప్పారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఎంతో చొరవ తీసుకొని జాతీయ స్థాయి వర్క్‌షాప్ నిర్వహణకు గుంటూరుని వేదికగా చేయడం ద్వారా ఈ ప్రాంతానికి మంచి పేరు తీసుకొచ్చారని రాష్ట్ర ప్రభుత్వ రెవెన్యూ అధికారులు ప్రశంసిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా తక్కువ వ్యవధిలో వర్క్‌షాప్ నిర్వహణకు సకల ఏర్పాట్లు చేసిన గుంటూరు జిల్లా యంత్రాంగాన్ని స్పెషల్ సీఎస్ జయలక్ష్మి అభినందించారు. అలానే కర్ణాటక, ఒడిస్సా, అస్సాం, లద్ధాక్ తదితర రాష్ట్రాల నుంచి వచ్చిన అధికారులు ఆయా రాష్ట్రాల్లో జరుగుతున్న రీసర్వే విధానం, అనుభవాలను పంచుకొన్నారు. అంతిమంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన డీఐఎల్ఆర్ఎంపీ కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేసి ప్రోత్సాహకాలు అందుకోవాలని అన్ని రాష్ట్రాల అధికారులు నిర్ణయించారు. చివరి రోజున మునిసిపల్ మంత్రి నారాయణ నక్షా కార్యక్రమంపై చేసిన ప్రసంగం అందరిని ఆకట్టుకుంది.

కేంద్ర ప్రభుత్వ భూ వనరుల శాఖ సెక్రటరీ మనోజ్ జోషి ప్రసంగాన్ని అందరూ శ్రద్ధగా ఆలకించారు. నాణ్యమైన భూ రికార్డులు నిర్వహించే రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వ భూ వనరుల శాఖ దాదాపు రూ.1000 కోట్ల వరకు ప్రోత్సాహక నిధులను అందిస్తుందని ఆయన చెప్పారు. ఆర్వోఆర్‌లో 80 శాతంకు పైగా వ్యక్తిగత ఖాతాలు ఉంటే దానిని నాణ్యమైన భూ రికార్డులుగా గుర్తించడం జరుగుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ లో 90 శాతానికి పైగా డిజిటలైజ్డ్ చేసిన భూ ఖాతాలలో వ్యక్తిగత ఖాతాలు ఉండటంతో అత్యధికంగా ప్రోత్సాహక నిధులు అందుకోవటం జరిగిందని ఉదహరించారు. జాతీయ వర్క్ షాపు వలన రాష్ట్రాల్లో జరుగుతున్న భూముల రీ సర్వే పై కేంద్ర ప్రభుత్వ భూవనరుల శాఖకు అవగాహన వచ్చిందన్నారు. అదే విధంగా రాష్ట్రాలకు ఇతర రాష్ట్రాల్లో జరుగుతున్న రీ సర్వే చేస్తున్న విధానం తెలుసుకునే అవకాశం కలిగిందన్నారు. మానవ వనరులను ప్రణాళిక ప్రకారం వినియోగించుకొని రీ సర్వేను నిర్దేశించిన లక్ష్యాల అధిగమించేలా కృషి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ భూ వనరుల శాఖ జాయింట్ సెక్రటరీ కునాల్ సత్యార్ధి కేంద్ర భూ వనరుల శాఖ సర్వే, రీ సర్వే , నక్షా కార్యక్రమాలకు వివిధ రాష్ట్రాలకు అందిస్తున్న నిధులు, ప్రోత్సాహకాలు, వివిధ రాష్ట్రాల ప్రతినిధులు భూముల రీ సర్వేకు సంబంధించి తెలిపిన అనేక సందేహాలకు కేంద్ర భూ వనరుల శాఖ అధికారులు నివృత్తి చేశారు. ఇన్‌చార్జి కలెక్టర్ ఎ.భార్గవ తే జ, జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు, తెనాలి సబ్ కలెక్టర్ సం జనా సింహా, డీఆర్వో ఖాజావలి, ఆర్డీఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఐదేళ్లు..5 ప్రభుత్వ ఉద్యోగాలు

ఆదర్శంగా నిలుస్తున్న మాజీ సైనికుడు



పొన్నూరుటౌన్, మే 16: భారత సైన్యంలో పదిహేడున్నర సంవత్సరాలు సేవలు అందించిన మాజీ సైనికుడు.. పదవీ విరమణ తర్వాత ఐదేళ్లలో ఐదు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి అందరి మన్ననలు అందు కుంటున్నాడు. బాపట్ల జిల్లా చందోలు గ్రామానికి చెందిన మహ మద్ గౌస్ కుటుంబం పొన్నూరు పట్టణంలోని ఇటికంపాడు రోడ్డులో స్థిరపడింది. సైన్యంపై మక్కువతో 2003లో 10వ తరగతి విద్యర్హతతో ఆర్మీలో చేరిన గౌస్ ఓ వైపు సిపాయిగా పని చేస్తూనే ఎంఏ ఎకనామిక్స్, మాస్టర్ ఆఫ్ లైబ్రరీ ఇన్‌ఫర్మేషన్ సైన్స్‌లో పోస్టు గ్రాడ్యుయేషన్ విద్యను పూర్తిచేశారు. హవాల్దార్‌గా, టీచర్ ట్రైనర్‌గా పలు విభాగాల్లో పని చేసిన గౌస్ 2020లో పదవి విరమణ చేశారు. అనంతరం పొన్నూరు వచ్చి.. కేంద్ర ప్రభుత్వం నిర్వహించే స్టాఫ్ సెలక్షన్ పరీక్షలతో పాటు, వివిధ పరీక్షలు రాశారు. జనరల్ కేటగిరిలో కోల్ ఇండియాలో షావల్ మిషన్ ఆపరేటర్‌గా తొలి ఉద్యోగాన్ని సాధించారు. అనంతరం ఇస్రో ఏ గ్రేడ్ వెహికల్ ఆపరేటర్‌గా, మరోసారి రాసిన పరీక్షలలో ఇస్రో లైట్ వెహికల్ ఆపరేటర్‌గా మొదటిసారి రాసిన పరీక్షల్లో జియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, మినిష్టీ ఆఫ్ సైన్స్ నిర్వహించిన పరీక్షలలో శాస్త్రవేత్తలకు డ్రైవర్‌గా ఎంపికయ్యారు. ఈ ఉద్యోగం చేస్తూనే జైళ్ల శాఖ నిర్వహించిన పరీక్షలకు హాజరైన గౌస్.. స్టాఫ్ డ్యూటీ ఉద్యోగానికి ఈ మే నెలలో ఎంపికయ్యారు. ప్రస్తుతం జైళ్లశాఖ డైరెక్టర్ జనరల్ కార్యాలయంలో స్టాఫ్ డ్యూటీలో చేరారు. ఒక ప్రభుత్వ ఉద్యోగం రావాలంటేనే ఎంతో శ్రమకోర్చి సిద్ధం అవ్వాల్సిన ప్రస్తుత తరుణంలో.. జనరల్ క్యాటగిరిలో ఐదేళ్ల కాలంలో ఐదు ప్రభుత్వ ఉద్యోగాలు గౌస్ సాధించడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది.

అమ్మో పిడుగు!



అప్రమత్తతోనే రక్షణ

● వాతావరణ శాఖ ముందస్తు హెచ్చరికలు ● జాగ్రత్తలు పాటించాలంటున్న నిపుణులు

సత్తెనపల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి) : పిడుగుపాటుకు పలు ప్రాంతాల్లో మనుషుల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. ప్రస్తుతం చిన్నపాటి మేఘాలు కమ్మినా.. వాతావరణం భీకరంగా మారిపోతోంది. వెంటనే ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం అప్పుడప్పుడు పిడుగులు పడుతున్నాయి. ఇలాంటి పరిస్థితికి వాతావరణంలోని మార్పులు ఒక కారణంగా కాగా.. మానవ తప్పిదం కూడా ఒక కారణమని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. భూ ఉపరితలం నుంచి ఎంత ఎత్తులో మేఘాల మధ్య ఘర్షణ నెలకొన్నా.. పిడుగులు తీవ్రత ఒకేలా ఉంటుందని, గాలి పీడనంలో వ్యత్యాసాలు, మేఘాల కదలికలపైన ఆధారపడి ఉంటాయన్నది వాతావరణ శాఖ నిపుణుల అభిప్రాయం. భూ ఉపరితలంలో 16 కిలో మీటర్ల నుంచి 13 కిలో మీటర్ల మధ్య మేఘాలు ఏర్పడతాయి. రెండు మేఘాల మధ్య ఘర్షణ నెలకొని అత్యధిక విద్యుతావేశం ఉద్భవిస్తుంది. ఆ సమయంలోనే ప్రశాంతమైన కాంతి, అధిక ధ్వని వెలువడతాయి. కాంతి వేగం ఎక్కువ కావడం వల్ల మొదట మెరుపు, తర్వాత ధ్వని వినిపిస్తుంది. మెరుపు ఎక్కువగా విస్తరిస్తే భూమిపై పిడుగు ప్రభావం తక్కువగా ఉంటుంది. మెరుపు ఒకే చోట మెరిసి శబ్దం చేస్తే దాని ప్రభావం భూ ఉపరితలం పై ఎక్కువగా ఉంటుంది. పిడుగు పడిన శబ్దం 24 కిలోమీటర్ల పరిధిలో అందరికీ వినిపిస్తుంది. ఆ సమయంలో 14 కిలో మీటర్ల పరిధిలో వర్షం కురిసే అవకాశం ఉంది. ఎత్తైన ప్రదేశాలు, చెట్లపై, తడిగా ఉన్న ప్రాంతాల్లో పిడుగులు పడతాయి. ఎలక్ట్రానిక్స్, విద్యుత్ పరికరాలను పిడుగులు వేగంగా ఆకర్షిస్తాయి. అందుకే వర్షంలో సెల్ ఫోన్ వాడకూడదు. వర్షంలో తప్పనిసరిగా ప్రయాణించాల్సి వస్తే సెల్ ఫోన్ స్విచ్ ఆఫ్ చేస్తే మంచింది. మనం ప్రయాణించే సమయంలో ఎక్కడ పిడుగులు పడినా సెల్ ఫోన్‌లు ఆకర్షిస్తాయని నిపుణులు చెబుతున్నారు.

ముందస్తు హెచ్చరిక కీలకం



భారీ వర్షాలు, పిడుగులకు సంబంధించిన సమాచారాన్ని వాతావరణ శాఖ మెసేజ్ రూపంలో తెలియజేస్తుంది. ఇలాంటి సమాచారాన్ని తేలిగ్గా తీసుకోకుండా ప్రజలు కచ్చితంగా సూచనలు పాటిస్తే మంచిది. వర్షం కురిసే సమయంలో తడిచి వెళ్లినా పర్వాలేదు, కాని తాటి, టేకు, కొబ్బరి తదితర చెట్ల కింద ఉండకూడదు. గొడుగు వేసుకుని వెళ్లడం ప్రమాదానికి సంకేతం. కార్లు, వాహనాల్లో ప్రయాణించే వారు ప్రయాణాన్ని ఆపివేస్తే మంచిది. వెళ్లాల్సి వస్తే కారు అద్దాలన్నింటినీ మూసి వేయాలి. రైతులు, పశువుల కాపర్లు, కూలీలు బహిరంగ ప్రదేశాల్లో పని చేసే వారు సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలి. ఇళ్లపై ఎత్తయిన ప్రదేశాల్లో మెటల్ రాడ్‌ను బిగించాలి. పిడుగు పడితే ఇది ఆకర్షించి ప్రమాదం జరిగే అవకాశం తక్కువగా ఉంటుంది.

- చొప్పర కమలాకర్, సైన్స్ ఉపాధ్యాయుడు, వెన్నాదేవి ఉన్నత పాఠశాల, సత్తెనపల్లి

దుగ్గిరాల యార్డులో పసుపు ధరలు

దుగ్గిరాల, మే 16(ఆంధ్రజ్యోతి): స్థానిక పసుపు మార్కెట్‌యార్డులో శుక్రవారం జరిగిన వేలంలో 305 బస్తాల పసుపు విక్రయాలు జరిగాయి. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.10,300, గరిష్ఠధర రూ.11,150, మోడల్‌ధర రూ.10,950పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.10,300, గరిష్ఠధర రూ.11,100 మోడల్‌ధర రూ.10,950 పలికాయి.

పాలిసెట్‌లో గోగులమూడి విద్యార్థికి 1574వ ర్యాంకు



పఠాన్ జోఆఫ్రిన్

పెదనందిపాడు, మే 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గోగులమూడి జిల్లా పరిషత్ పాఠశాల 10వ తరగతి విద్యార్థి పఠాన్ జోఆఫ్రిన్ పాలిసెట్‌లో రాష్ట్ర స్థాయిలో 1574వ ర్యాంకు సాధించింది. పది పరీక్షల్లోనూ మండల స్థాయిలో అత్యధిక మార్కులు సాధించింది. ఏపీ పాలిసెట్‌లో ఉత్తమ ర్యాంకు సాధించిన విద్యార్థినిని ఉపాధ్యాయులతో పాటు గ్రామస్థులు అభినందించారు.

వేసవి చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న ట్రస్టు ప్రతినిధులు

మంగళగిరి, మే 16 (ఆంధ్రజ్యోతి): పెదవడ్లపూడి భగవాన్ శ్రీ సత్య షిరిడీ సాయిబాబా మందిరం వద్ద సాయి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో వేసవిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన చలివేంద్రంలో శుక్రవారం మజ్జిగ పంపిణీ చేశారు. ట్రస్టు కార్యదర్శి పాతూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ మందిరం వద్ద వేసవిలో గత పది సంవత్సరాల నుంచి మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని, ఈ ఏడాది కూడా పూల తోటలకు వచ్చే రైతు కూలీలకు, బాటసారులకు, భక్తుల కోసం మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో భక్త బృందం ప్రతినిధులు అన్నే శరత్, చల్లపల్లి కిరణ్, కోటేశ్వరరావు, జవ్వాది సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రావిపాడులో చోరీ

పెదనందిపాడు, మే 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రావిపాడులో నూతలపాటి నాగవేణు(నాని)కి చెందిన ఇంట్లో గురువారం రాత్రి చోరీ జరిగింది. నాని కుటుంబ సభ్యులతో కలిసి రెండు రోజుల క్రితం హైదరాబాద్ వెళ్లారు. శుక్రవారం ఉదయం తలుపులు తీసి ఉండడంతో గమనించిన బంధువులు ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలోని దుస్తులను చెల్లాచెదురుగా పడేసి నగదు, బంగారం, వెండి వస్తువులను అపహరించుకెళ్లినట్లు గుర్తించారు. సంఘటనా స్థలానికి క్లూస్‌టీం వచ్చి వేలిముద్రలు సేకరించింది.

దొంగతనాలకు పాల్పడుతోన్న ఐదుగురు అరెస్టు

● రూ.3.20 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం

● జైలులో పరిచయంతో ముఠాగా ఏర్పడిన నిందితులు

గుంటూరు, మే 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా వివిధ దేవాలయా ల్లో దొంగతనాలకు పాల్పడుతోన్న ఐదుగురు సభ్యుల దొంగల ముఠాను నల్లపాడు పోలీసులు అరెస్ట్ చేసారు. వారి వద్ద నుంచి రూ.3 లక్షల 20 వేల ఖరీదైన ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు శుక్రవారం నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో సౌత్ డీఎస్పీ భానోదయ, నల్లపాడు సీఐ వంశీధర్ వివరాలు వెల్లడించారు. డీఎస్పీ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గత మార్చి 3న ఓబులనాయుడు పాలెం గ్రామంలో గల శ్రీ సీతారామ భద్రాద్రి స్వామి దేవాలయం తాళాలు పగులగొట్టి నార్సింగ్ గంగాధర్, నార్సింగ్ మహేష్, కారంపూడి విజయ్ కుమార్, పుట్టా వెంకటేష్, వేమవరపు విద్యాసాగర్ వెండి, బంగారపు వస్తువులు, హుండీలోని డబ్బులు అపహరించుకుపోయారు. వారిని విచారించగా నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఈ ఆలయ దొంగతనంతో పాటు పెదకాకాని పోలీస్ స్టేషన్ పరిధి లోని అనమర్లపూడి గ్రామంలోని చమల్లమ్మ తల్లి దేవాలయంలో జరిగిన దొంగ తనం, తెనాలి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కాజీపేట గ్రామంలో గల శ్రీ లక్ష్మి మైసమ్మ దేవాలయంలో జరిగిన దొంగతనాలను వీరే చేసినట్లు అంగీకరించారు. వీరు ఎక్కువగా బంగారు, వెండి ఆభరణాలు ఉన్న దేవాలయాలను టార్గెట్ గా చేసుకొని దొంగతనాలకు పాల్పడుతుంటారన్నారు. పగటి పూట రెక్కీ చేసి, రాత్రి పూట దొంగతన చేస్తారని విచారణలో తేలిందన్నారు.

బాధితులకు సత్వర న్యాయం అందాలి

● ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు



అర్జీలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రామాంజనేయులు

గుంటూరు(తూర్పు), మే 16(ఆంధ్రజ్యోతి): గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించి, బాధితులకు సత్వర న్యాయం అందేలా చూడాలని అధికారులను ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు ఆదేశించారు. విద్యానగర్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం జరిగిన గ్రీవెన్స్‌డే కార్యక్రమంలో ప్రజలు నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. రామాంజనేయులు మాట్లాడుతూ అర్జీలో అధికంగా భూ వివాదాలు ఉన్నాయని వాటిపై దృష్టి సారించాలన్నారు. గత ప్రభుత్వంలో పెద్దఎత్తున భూ అక్రమణలు జరిగాయని వాటిపై విచారణ జరిపించి బాధితులకు న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదులను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని స్పష్టం చేశారు. పరిష్కారం కాని అర్జీలపై వివరణ ఇవ్వాలన్నారు. వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. అనంతరం రింగురోడ్డు త్రీఫేజ్ విస్తరణలో భాగంగా నివాసాలు కోల్పోయిన వారికి ఆయన చెక్కులను పంపిణీ చేశారు. మిగిలినవారికి త్వరలోనే చెక్కులను అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కల్లూరి శ్రీనివాసరావు, గింజుపల్లి వెంకటేశ్వర రావు, కార్పొరేటర్ స్మితపద్మజ తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి గాలివాన బీభత్సం

● కరెంటు కోత.. ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి



అడ్డరోడ్డు వద్ద గాలివానకు రోడ్డుపై పడిపోయిన చెట్టు



తాడికొండ తహసీల్దార్ కార్యాలయంలో కూలిపోయిన రేకుల షెడ్డు

ప్రత్తిపాడు, మే 16(ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి గాఢాంధకారం.. భయంకరమైన ఉరుములు, మెరుపులు.. మరోపక్క భారీ వర్షంతో ప్రత్తిపాడువాసులు వణికిపోయారు. ప్రజలందరూ ఘాడనిద్రలో ఉన్న సమయంలో శుక్రవారం తెల్లవారుజామున సుమారు రెండు గంటల నుంచి ఉరుములు, మెరుపులతో భారీ వర్షం మొదలైంది. దీంతో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. భారీ వర్షంలోనూ ఉక్కబోత, దోమల మోతతో ప్రజలకు తప్పలేదు. దీంతో ప్రజలు నిద్రలేక జాగారం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. భారీ వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మల్లాయపాలెం, వంగిపురం ప్రాంతాలలో పొలాలు నీట మునిగాయి.

విద్యుత్‌కు తీవ్ర అంతరాయం

భారీవర్షం కారణంగా విద్యుత్‌కు శుక్రవారం మధ్యాహ్నం వరకు అంతరాయం ఏర్పడింది. ప్రత్తిపాడు మండలంలో అక్కడక్కడ పడిన పిడుగులు, ఉరుముల కారణంగా స్థంభాలపై ఉండే 75 వరకు ఇన్సులేటర్స్ పగిలి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. రెండు మూడు గ్రామాలలో ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద కూడా సమస్యలు తలెత్తాయి. సిబ్బంది కొరత కారణంగా విద్యుత్ సరఫరాను పునరుద్ధరణ తీవ్రజాప్యమైంది. సుమారు పది గంటల పాటు కరెంటు లేకపోవడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

కాకుమానులో..

కాకుమాను గురువారం అర్ధరాత్రి నుంచి ఈదురు గాలులు, పిడుగులు, ఉరుములతో కూడిన భారీవర్షం కురిసింది. ఈదురు గాలులకు వాణిజ్య పంటలు నేల మట్టమయ్యాయి. విద్యుత్ స్థంభాలు విరిగిపడి పోవడంతో విద్యుత్ సరఫరా నిలిచి పలు గ్రామాలలో అంధకారం నెలకొంది. భారీవృక్షాలు నేలకొరిగాయి. వాణిజ్యపంటలు సాగుచేసే రైతులు తీవ్రంగా నష్టపోయారు. మండలంలో 53.2మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ వెంకటస్వామి తెలిపారు.

గోగులమూడిలో పిడుగుపాటు

పెదనందిపాడు: మండల పరిధిలో శుక్రవారం వేకువజామున ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో భారీవర్షం బీభత్సం సృష్టించింది. గోగులమూడిలో పిడుగుపాటుకు పశువుల కొష్టం కూలిపోయింది. మండలంలో 88.6 మి.మీల వర్షపాతం నమోదైంది. ఈదురు గాలులకు భారీ హోర్డింగ్‌లు, వృక్షాలు నేలకొరిగాయి. చెట్లను, హోర్డింగులను తొలగించి పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రించారు. గ్రామాల్లో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఇళ్లవద్ద ఉన్న పొగాకు మండె లకిందకు వర్షపు నీరు చేరడంతో రైతులు వాటిని కాపాడుకునేందుకు నానా అవస్థలు పడ్డారు. మండలంలో తెల్లవారుజాము నుంచి రాత్రి 8గంటలకు కూడా కొన్ని గ్రామాల్లో విద్యుత్ పునరుద్ధరించలేదు.

తాడికొండలో..

తాడికొండ, మే 16(ఆంధ్రజ్యోతి): తాడికొండలో శుక్రవారం తెల్లవారుజామున భారీ గాలివాన పడింది. గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండవేడికి అల్లాడిన ప్రజలు రాత్రికి అక్కడక్కడ చిరుజల్లులు కురవటంతో కాస్త ఉపశమనం పొందారు. అయితే శుక్రవారం తెల్లవారుజామున 2.30 గంటల నుంచి భారీగా ఈదురుగాలులు వీచాయి. అనంతరం పెద్ద పెద్ద శబ్దాలతో ఉరుములు, మెరుపులు వచ్చాయి. గాలులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. రాత్రి 2 గంటల నుంచి ఉదయం 8.30 గంటలకు వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గాలి, వర్షానికి పెద్ద పెద్ద చెట్లు కూలిపోయాయి. తాడికొండ అడ్డరోడ్డు రహదారిలో రోడ్డుకు అడ్డంగా చెట్టు కూలిపోయింది. తాడికొండ తహసీల్దార్ కార్యాలయంలో ఉన్న రేకుల షెడ్డు కూలిపోయింది. వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి.



ప్రత్తిపాడు: మల్లాయపాలెంలో నీట మునిగిన లోతట్టు ప్రాంతాలు

దోమతెరలు వాడండి..

● జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీలు

తాడేపల్లి టౌన్, మే 16(ఆంధ్రజ్యోతి): డెంగీ, ఇతర వ్యాధులు ప్రబలకుండా చిన్న జాగ్రత్తలు తీసుకుంటే అందరూ పెద్ద రక్షణ పొందవచ్చని తాడేపల్లి పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ అనూష చెప్పారు. బుధవారం జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా తాడేపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సీతానగరంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటి చుట్టుపక్కల వర్షపు నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. డాబాల మీద వాటర్‌ట్యాంక్‌ల మూతలు సరిగ్గా ఉండేట్లు చూడడంతోపాటు కొబ్బరి బోండాలు, కొబ్బరిచిప్పలు ఉండకుండా చూసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీహెచ్‌వో గురుకుమార్, ఎస్‌యూవో సుధీర్, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, ఆరోగ్య కార్యకర్తలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



మంగళగిరి: ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది



దుగ్గిరాలలో ర్యాలీలో పాల్గొన్న ఎంపీడీఓ శ్రీనివాసావు, పీహెచ్‌సీ డాక్టర్లు, వైద్య సిబ్బంది

దుగ్గిరాలలో..

దుగ్గిరాల, మే 16 (ఆంధ్రజ్యోతి): దోమల నివారణ ద్వారా డెంగీ బారినపడకుండా జాగ్రత్త వహించాలని దుగ్గిరాల పీహెచ్‌సీ డాక్టర్ ఇందిర అన్నారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని దుగ్గిరాల గ్రామంలో దోమల వ్యాప్తిచెందకుండా తీసుకోవలసిన చర్యలను వివరిస్తూ నినాదాలు చేస్తు ర్యాలీ కొనసాగించారు. దుగ్గిరాల ఎంపీడీఓ కార్యాలయం నుంచి దుగ్గిరాల మెయిన్‌రోడ్ శివాలయం మీదుగా కొత్తలాకు వరకూ ర్యాలీ అనంతరం ప్రతిజ్ఞ చేశారు. మురుగునీరు నిల్వలేకుండా చూసుకోవాలని, దోమతెరలు వాడాలని, దోమల వ్యాప్తికి అవకాశం ఇవ్వకుండా పరిసరాలకు పరిశుభ్రంగా ఉంచుకోవాలని నినాదాలు చేశారు. పంచాయతీ సిబ్బందితో కలిసి నిర్వహించిన ర్యాలీలో పీహెచ్‌సీ డాక్టర్ అబ్దుల్ రహమాన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మెప్మా కార్యకలాపాలకు మహిళా మండలి భవనం సిద్ధం

తెనాలి అర్బన్, మే 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొత్తపేట సరోజిని నాయుడు రోడ్డులోని మహిళా మండలి భవనాన్ని మెప్మా కార్యకలాపాలకు వినియోగించుకునేందుకు సిద్ధం చేశారు. 1968లో మహిళలు కమిటీగా ఏర్పడి మహిళా సంక్షేమం కోసం 300 గజాల స్థలంలో భవనం నిర్మించారు. మహిళల ప్రగతికి అవసరమైన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు మహిళా బాలల గ్రంథాలయాన్ని కూడా జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. కొన్నేళ్లుగా మహిళా మండలి కార్యకలాపాలు నిలిచిపోవడంతో విలువైన ఆస్తి అన్యాక్రాంతం కాకుండా ఉండేందుకు గాను కమిటీ సభ్యులు ప్రభుత్వానికి అప్పగించారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పర్యవేక్షణలో ఈ ఆస్తిని మున్సిపాలిటీకి రిజిస్ట్రేషన్ చేశారు. ఈ భవనాన్ని మహిళా సాధికారత కార్యక్రమాలకు మాత్రమే వినియోగించుకోవాలని మహిళా మండలి కమిటీ సభ్యులు స్పష్టం చేయడంతో ఇక్కడ మున్సిపల్ పరిధిలోని మెప్మా విభాగాన్ని నిర్వహించేందుకు గాను నిర్ణయించారు. మిషన్ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ పావర్టీ ఇన్ మున్సిపల్ ఏరియాస్ విభాగం నిర్వహించేందుకు గాను నిధులు కేటాయించి భవనాన్ని మరమ్మతులు చేయించి సిద్ధం చేశారు. మెప్మా విభాగంలో సిటిమిషన్ మేనేజర్ ఆధ్వర్యంలో ఆరుగురు కమ్యూనిటీ ఆర్గనైజర్లు, 84 మంది రిసోర్స్ పర్సన్లు, మహిళా సంక్షేమానికి కృషి చేస్తున్నారు. పట్టణ పరిధిలో 2600కి పైగా మహిళా సంఘాలు ఉండగా ప్రతి సంఘంలో 10మంది సభ్యులు వరకు ఉన్నారు. వీరి ఆర్థిక ప్రగతి ప్రభుత్వ కార్యక్రమాల అమలు మెప్మా చూస్తోంది.



మెప్మా విభాగం కోసం సిద్ధం చేసిన మహిళా మండలి భవనం

జై కాపుసేన వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కొండలరావు

మంగళగిరి, మే 16 (ఆంధ్రజ్యోతి): ఏపీ జై కాపుసేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మంగళగిరికి చెందిన తిరుమలశెట్టి కొండలరావు నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం మంగళగిరిలో జరిగిన కార్యక్రమంలో జై కాపుసేన వ్యవస్థాపక అధ్యక్షుడు బసవ చినబాబు చేతులమీదుగా కొండలరావు నియామకపత్రం అందుకున్నారు. చినబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని పేద కాపులపై ప్రత్యేక దృష్టి సారించి ఉచిత విద్య, వైద్యం అందించాలని కోరారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో కాపు కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం చేపట్టాన్నారు. గతంలో సీఎం చంద్రబాబు ఓబీసీ రిజర్వేషన్ ప్రక్రియలో భాగంగా కాపులకు 5 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు తనవంతు కృషి చేశారని, జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 5 శాతం రిజర్వేషన్లను తుంగలో తొక్కిందని విమర్శించారు. త్వరలోనే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను కలిసి కాపుల సమస్యలను విన్నవిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జై కాపుసేన రాష్ట్ర అధ్యక్షుడు బెల్లంకొండ వెంకన్నబాబు, ఉపాధ్యక్షులు సమ్మెట వెంకన్నబాబు, చిట్టూరి రవీందర్, మేడేపల్లి కనక రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి మొహమాటం అనిల్‌బాబు, లీగల్ సెల్ అధ్యక్షుడు లంకిశెట్టి బాలాజీ, జిల్లా అధ్యక్షుడు యడ్లపల్లి దానారావు, పల్నాడు అధ్యక్షుడు అన్నదాసు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



కొండలరావుకు నియామకపత్రం అందజేస్తున్న జై కాపుసేన నేతలు

సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యం

● మండల సమావేశంలో ఎంపీడీవో యుగకీర్తి

కాకుమాను, మే 16 (ఆంధ్రజ్యోతి): అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీడీవో యుగకీర్తి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్క గ్రామంలో మంచినీటి ఎద్దడి తలెత్తకుండా గ్రామీణ నీటి సరఫరా శాఖ విభాగం అధికారులు పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు, జడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్ బేగం, ఎంఈవో కెన్నడీ, ఏవో కిరణ్మయి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో యుగకీర్తి



గ్రీవెన్స్‌లో అదనపు కమిషనర్‌కు సమస్యలు చెపుతున్న రైతులు

రైతులు, రైతు కూలీల కోసం గ్రీవెన్స్

● ఫిర్యాదులు స్వీకరించిన అదనపు కమిషనర్

తుళ్లూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో రైతులు, రైతు కూలీలు సమస్యల పరిష్కారం కోసం తుళ్లూరు సీఆర్‌డీఏ ప్రాంతీయ కార్యాలయంలో అదనపు కమిషనర్ జీ. సూర్యసాయి ప్రవీణ్‌చంద్ గ్రీవెన్స్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా కౌలు చెల్లింపు, ఎన్-13 రోడ్డు అలైన్‌మెంట్ మార్పు, వారసులకు ప్లాట్ల రిజిస్ట్రేషన్, గ్రామ కంఠం భూముల సమస్యలపై రైతులు ఫిర్యాదులు అందజేశారు. ప్లాట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియపై అర్జీదారులు తెలియజేసిన సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. రోడ్డు అలైన్‌మెంట్, గ్రామం కంఠం భూములపై ప్రభుత్వ ఆదేశానుసారం చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి శుక్రవారం జరిగే గ్రీవెన్స్‌డేను రైతులు వినియోగించుకోవాలన్నారు. గ్రీవెన్స్ డేలో భూముల వ్యవహారాలు 34, సామాజిక సంక్షేమం 1, ల్యాండ్స్ సర్వే-1 అర్జీలు అందాయి. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కె. స్వర్ణమేరి, చిన్నికృష్ణ, సాయి శ్రీనివాస్ నాయక్, రవీందర్, శేషరెడ్డి భాగ్యరేఖ నోడల్ అధికారి పి.జయశ్రీ పాల్గొన్నారు.

దేవునిమాన్యంలో ప్లాట్లు ఇవ్వండి

● సీడ్ యాక్సిస్ రోడ్ బాధిత రైతులు



సీడ్ యాక్సిస్ రోడ్ బాధిత రైతుల సమావేశంలో పాల్గొన్న నేతలు, రైతులు

తాడేపల్లి (ఉండవల్లి), మే 16(ఆంధ్రజ్యోతి): రాజధానిలో సీడ్ యాక్సిస్ రోడ్ నిర్మాణానికి భూములు ఇవ్వడానికి ఉండవల్లి రైతులకు ఎట్టి అభ్యంతరం లేదని అయితే భూములిచ్చిన రైతులకు ఉండవల్లి దేవుడిమాన్యంలో గానీ యు-1 జోన్‌లో గానీ అభివృద్ధి చేసిన ప్లాట్లు ఇవ్వాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకర్ ప్రభుత్వాన్ని కోరారు. రైతు సంఘం డివిజన్ అధ్యక్షుడు కె.ఈశ్వరరెడ్డి అధ్యక్షతన శుక్రవారం ఉండవల్లిలో బాధిత రైతుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ గ్రామాల్లో విధించిన వివిధ రకాల జోన్లు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. భూములలో అన్ని రకాల నిర్మాణాలు చేసుకునే విధంగా భూ యజమానులకు అనుమతులు ఇవ్వాలని కోరారు. లాండ్ పూలింగ్‌లో ఇచ్చిన రైతుల భూముల ప్లాట్లు వెంటనే అభివృద్ధి పరిచి అప్పగించాలని కోరారు. ప్రముఖ వైద్యుడు డాక్టర్ కన్నారావు నాయుడు మాట్లాడుతూ ఉండవల్లి రైతుల భూములపై కోర్టు స్టే ఉందని రైతులు అధైర్యపడవద్దని సూచించారు. బలవంతంగా రైతుల నుండి భూములు తీసుకోవద్దని కోరారు. బహుళ అంతస్తుల భవనాలకు కూడా అనుమతులు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో రైతులు మున్నంగి అంజిరెడ్డి, దండమూడి సాంబశివరావు, కళ్లం అరవింద రెడ్డి, టి బక్కిరెడ్డి, వీరాస్వామి, డాక్టర్ కన్నారావు నాయుడు పాల్గొన్నారు.

నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

ఫిరంగిపురం, మే 16 (ఆంధ్రజ్యోతి): ఫిరంగిపురంలోని ముస్లింపేటలో వేసవి కాలంలో విద్యుత్ డిమాండ్ తీర్చటం కోసం, లో వోల్టేజీ సమస్యలను నివారించటం కోసం 100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌కు బదులుగా 160కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను శుక్రవారం ఏర్పాటు చేశామని విద్యుత్ ఏఈ దుర్గా ప్రసాదు తెలిపారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ మార్పు వల్ల స్థానిక ప్రజలకు నిరవధికంగా స్థిరమైన ఓల్టేజీతో కూడిన విద్యుత్ సరఫరా అందుతుందన్నారు. ఈ వేసవి కాలంలో విద్యుత్ అంతరాయాలు తక్కువగా ఉంటాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎల్‌ఐలు, లైన్‌మెన్‌లు పాల్గొన్నారు..



సర్టిఫికెట్లు అందిస్తున్న బాలోత్సవం ప్రతినిధులు

ముగిసిన బాలోత్సవం శిక్షణ

తాడేపల్లి టౌన్, మే 16(ఆంధ్రజ్యోతి): గత నెల 28 నుండి ఈ నెల 15వ వరకు మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం, అమరావతి ఐకాన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పిల్లల వేసవి శిక్షణా శిబిరం ముగింపు కార్యక్రమం గురువారం రాత్రి అమరావతి ఐకాన్‌లోని క్లబ్ హౌస్ వద్ద నిర్వహించారు. గణితంలో మెతకువలు, డాన్స్ నేర్పించారు. ఈ సందర్భంగా సర్టిఫికెట్లు, బహుమతి ప్రదానం నిర్వహించారు. బాలబాలికలు శిక్షణలో నేర్చుకున్న వివిధ నృత్యరూపాలు ప్రదర్శించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ పిల్లలు పుస్తకాలు చదవాలని, అప్పుడే సమాజం అర్థమవుతుందని, చిన్నతనం నుండే పాఠ్యపుస్తకాలతోపాటు చరిత్ర పాఠాలు తెలుసుకోవాలని కోరారు. ఎంటీఎంసీ బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి అధ్యక్షులు రావూరి రమేష్ బాబు, అమరావతి ఐకాన్ వెల్ఫేర్ అధ్యక్షుడు ఎం వినోద్‌కుమార్, అమ్మ కల్యాణ మండపం విజయవాడ పూర్వ అధ్యక్షుడు యార్లగడ్డ సుబ్బారావు, ఎన్ లెనిన్‌బాబు, వేసవి శిక్షణ శిబిరం బాధ్యులు ఎం మనోహర్‌రెడ్డి, గోపు నాగరాజు, ఓబులారెడ్డి, డాన్స్ మాస్టర్ చందు, వై బర్నబాస్, శివరామిరెడ్డి, కోదండరామయ్య తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య సిబ్బంది వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

దుగ్గిరాల, మే 16(ఆంధ్రజ్యోతి): గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు నిత్యం శ్రమించే పారిశుధ్య సిబ్బంది వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని దుగ్గిరాల పీహెచ్‌సీ డాక్టర్ ఇజాజ్ అహ్మద్ అన్నారు. దుగ్గిరాల గ్రామసచివాలయంలో వైద్యపరీక్షా శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. పారిశుధ్య సిబ్బంది ఇండ్లలోనూ వ్యాధులు ప్రబలకుండా శుభ్రతను పాటించాలన్నారు. చిన్నపాటి జ్వరం వంటి సమస్యలు వచ్చినా తక్షణమే డాక్టర్ సూచనల మేరకు, అవసరమైన మందులు తీసుకోవాలన్నారు. గ్రీన్ అంబాసిడర్లకు వైద్యపరీక్షలు జరిపి మందులను అందించారు. ఈఓ సీహెచ్ వివేకానంద, పీహెచ్‌సీ సిబ్బంది శ్రీనివాస్, బీవీ నాయక్ పాల్గొన్నారు.



దుగ్గిరాల పంచాయతీ కార్యాలయంలో గ్రీన్ అంబాసిడర్లకు వైద్యపరీక్షలు చేస్తున్న పీహెచ్‌సీ వైద్యసిబ్బంది

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

నేడు తెనాలి రానున్న మంత్రి మనోహర్

తెనాలిరూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ శనివారం తెనాలిలో పర్యటించనున్నారు. ఉదయం 7గంటలకు స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా తెనాలి పట్టణంలోని బుర్రిపాలెం రోడ్డులోని శివాజీ చౌక్ నుంచి బయలుదేరి రాములవారి గుడి మీదుగా మహాత్మాగాంధీ కూరగాయల మార్కెట్ వరకు మున్సిపల్ అధికారులు, సిబ్బందితో కలిసి వివిధ పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించనున్నారు. అనంతరం మహాత్మాగాంధీ కూరగాయల మార్కెట్ వద్ద జరిగే మెగా క్లీనింగ్ కార్యక్రమంలో పాల్గొంటారు. సాయంత్రం 4గంటలకు తెనాలి పట్టణం చెంచుపేటలోని జిల్లా ప్రభుత్వ వైద్యశాల నుంచి కొడాలి వీరయ్య మున్సిపల్ పార్క్ మీదుగా రావి టవర్స్ వరకు మునిసిపల్ సిబ్బంది చేపడుతున్న వివిధ పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలిస్తారని కార్యాలయ వర్గాలు ఓ ప్రకటనలో తెలిపాయి.

తిరంగా ర్యాలీని జయప్రదం చేద్దాం

తెనాలి రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన నేపథ్యంలో శనివారం తెనాలి పట్టణంలో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు టీడీపీ నాయకులు చెప్పారు. శుక్రవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పట్టణంలోని చినరావూరు పార్క్ నుంచి సాయంత్రం 4 గంటలకు ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. ఈ ర్యాలీ బోసు రోడ్డు, గాంధీచౌక్ మెయిన్‌రోడ్డు మీదుగా మునిసిపల్ బిల్డింగ్ వరకూ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పాల్గొంటారని, కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు, విద్యార్థినీ, విద్యార్థులు, మాజీ సైనికోద్యోగులు, కుల, మత, రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మహిళపై దాడి

తెనాలి, మారీసుపేట,మే 16 (ఆంధ్రజ్యోతి): మహిళపై దాడిచేసి గాయపర్చిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక అమరావతి ప్లాట్స్‌కు చెందిన మండే రేవతి ఇంటి వద్ద టిఫిన్ సెంటర్‌ను నిర్వహిస్తూ జీవనం సాగిస్తోంది. శుక్రవారం రాత్రి అదే ప్రాంతానికి చెందిన కసుకుర్తి బాబురావుతో వివాదం జరిగి అతను గడ్డపారతో రజనిపై దాడిచేసి గాయపర్చాడు. గాయపడిన రజనిని కుటుంబ సభ్యులు జిల్లా వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. శనివారం బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

దాడిపై మినీ లారీ డ్రైవర్ ఫిర్యాదు

తెనాలి మారీసుపేట, మే 16 (ఆంధ్రజ్యోతి): రోడ్డుకు అడ్డంగా ఉండటంతో హారన్ కొట్టినందుకు తనపై దాడిచేసి వాహనం అద్దం పగులగొట్టాడన్న లారీ డ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. స్థానిక భాస్కర్‌రావుపేటకు చెందిన షేక్ జానీ ఈ నెల 12న బస్టాండ్ వైపు మినీలారీతో వెళుతున్నాడు. ఇదే క్రమంలో ఆ ప్రాంతంలో ఐతానగర్‌కు చెందిన పూసపాటి సాయి రోడ్డుపై మరో వ్యక్తితో ఘర్షణపడుతూ ట్రాఫిక్‌కి అంతరాయం కల్గిస్తున్నాడు. దారి కోసం మినిలారీలో ఉన్న జానీ వాహనం హారన్ మోగించగా అతడి లారీ అద్దం పగులగొట్టి, లారీలో నుంచి కిందకు లాగి దాడి చేశాడు. దీనిపై బాధితుడు శుక్రవారం పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదుచేశాడు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బాలికలకు పౌష్టికాహారం ముఖ్యం: ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌజన్యశ్రీ

తెనాలి, మారీసుపేట, మే 16 (ఆంధ్రజ్యోతి): బాలికలు రక్తహీనత బారిన పడకుండా ఉండేందుకు పౌష్టికాహారం ముఖ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌజన్యశ్రీ అన్నారు. శుక్రవారం స్థానిక నందులపేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో కిషోరి వికాసం వేసవి శిక్షణ కార్యక్రమాలలో భాగంగా బాలికలకు కౌమార దశలో రక్తహీనత బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌజన్యశ్రీ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు రక్తహీనత బారినపడకుండా ఉండేందుకు తాజా ఆకు కూరలు, పండ్లు, పాలు, గుడ్లు వంటివి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీసు సాయి ప్రసన్న, అంగన్‌వాడీ కార్యకర్తలు సూర్యకుమారి, రేణుక, బాలికలు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

తెనాలి అర్బన్, మే 16 (ఆంధ్రజ్యోతి): యువత క్రీడల్లో రాణించి దేశ ప్రతిష్ఠ పెంచాలని వీఎస్ఆర్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్ పేర్కొన్నారు. కళాశాలలో కేఏల్ 10వ సీజన్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన శుక్రవారం ప్రారంభించారు. కెవైఆర్, కేబీఎస్, క్రికెట్ లీగ్ కమిటీ ఆధ్వర్యంలో టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రీడా స్ఫూర్తితో క్రీడాకారులు ఆటల్లో పాల్గొనాలని, శారీరక, మానసిక వికాసానికి క్రీడలు దోహదపడుతాయన్నారు. వ్యసనాలకు లోను కాకుండా జీవితాన్ని చక్కదిద్దుకోవాలన్నారు. అజయ్, గోపి, సురేష్, కిరణ్, గణేష్, యుగంధర్, యశ్వంత్ పాల్గొన్నారు.

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ

తెనాలి, మారీసుపేట,మే 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక బోసురోడ్డులోని పొట్టిశ్రీరాములు విగ్రహం సమీపంలో అన్నదాత సుఖీభవ సభ్యులు ఏర్పాటు చేసిన వేసవి చలివేంద్రంలో మజ్జిగను పంపిణీ చేశారు. శుక్రవారం అన్నదాత సుఖీభవ సభ్యులు రాచంశెట్టి కోటేశ్వర శర్మ జ్ఞాపకార్థం భార్య లింగమాంబ కుమారుడు వినయ్ గౌతమ్, కుమార్తె నవ్య, కుటుంబ సభ్యులు, సహకారంతో పాదచారులకు చల్లని మజ్జిగను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కుర్రా శ్రీనివాసరావు, వినయ్, లింగమాంబ, నవ్య, ప్రతాప్, వాసు తదితరులు పాల్గొన్నారు.

ఈదురు గాలుల బీభత్సం


కొల్లిపర సమీపంలో గాలికి పడిపోయిన అరటి చెట్లు


తూములూరులో నీటితో నిండిపోయిన సిమెంట్ రోడ్డు

తెనాలి రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): మండల గ్రామాల్లో గురువారం అర్ధరాత్రి తరువాత వీచిన ఈదురుగాలుల బీభత్సంతో పలు చోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు నేల కొరిగాయి. చిరుజల్లులు కురవడం ఉరుములు, మెరుపుల శబ్దాలతో దాదాపుగా మూడు గంటల పాటు కొనసాగింది. కంచెర్లపాలెం పంట పొలాల్లో కాలువ సమీపంలో కొబ్బరి చెట్టు గాలి వేగానికి విరిగి విద్యుత్ లైన్లపై పడటంతో తీగలు తెగాయి. అలాగే అదే ప్రాంతంలో మరో విద్యుత్ స్తంభం విరగగా, మండలంలోని కొలకలూరులో విద్యుత్ ఇనుప స్తంభం నేలవాలింది. తేలప్రోలులో వృక్షం నేలవాలింది. పలు ఫ్లెక్సీబోర్డులు విరిగిపోయాయి. సంగంజాగర్లమూడి, అంగలకుదురు వంటి పలు గ్రామాల్లో నిమ్మతోటల్లో పిందె దశలో ఉన్న కాయలు గాలి వేగానికి రాలి పోవడంతో రైతులు ఆందోళన చెందారు. విద్యుత్ సరఫరా మండలవ్యాప్తంగా శుక్రవారం మధ్యాహ్నం వరకు నిలిచిపోయింది. విద్యుత్ అధికారులు ఎక్కడికక్కడ సమస్యలను గుర్తించి సిబ్బంది ద్వారా యుద్ధప్రాతిపదికన లైన్లు మరమ్మతులు, నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. ఎవ్వరికీ ఎటువంటి ప్రాణనష్టం, ఆస్తి నష్టం సంభవించలేదు.

ఐదు గంటలు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తెనాలి అర్బన్, మే 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శుక్రవారం తెల్లవారుజామున ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. మూడు గంటల సమయంలో మబ్బులు కమ్మి గాలులు వీస్తూ వర్షం కురిసింది. దీంతో పలు ప్రాంతాల్లో విద్యుత్ తీగలపై చెట్ల కొమ్మలు విరిగి పడ్డాయి. విద్యుత్ లైన్లు తెగిపోవడంతో సరఫరా నిలిచిపోయింది. ప్రధాన సబ్ స్టేషన్ పరిధిలోనే సమస్య తలెత్తడంతో ఐదారు గంటల పాటు విద్యుత్ సరఫరా లేకుండా పోయింది. ఉదయం 8 గంటలకు కొన్ని ప్రాంతాల్లో, 10 గంటలకు మరికొన్ని ప్రాంతాల్లో సరఫరా పునరుద్ధరించారు. పగలంతా వాతావరణం చల్లగా ఉండటంతో ఎండలకు తల్లడిల్లుతున్న జనానికి ఊరట లభించింది.

జలమయమైన రోడ్లు

కొల్లిపర, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం తెల్లవారుజామున ఒక్కసారిగా మబ్బులు కమ్ముకొచ్చి గాలులతో అకాల వర్షం పడింది. దీంతో రోడ్లు అన్నీ జలమయమయ్యాయి. ఎడతెరిపిలేకుండా వర్షం పడటంతో మురుగు కాల్వల్లోని నీరు ఎక్కడికక్కడ స్తంభించాయి. మున్నంగి, వల్లభాపురం, తూములూరు, చివలూరు, సిరిపురం, దావులూరు, దావులూరిపాలెం తదితర గ్రామాల్లో ప్రధాన రహదారులు సైతం వర్షం నీటితో నిండిపోయాయి. రహదారులపై గజంలోతు నీరు చేరడంతో వాహనాదారులు పలు ఇబ్బందులకు గురయ్యారు. మండల కేంద్రం కొల్లిపరలో ప్రధాన రహదారులు సైతం నీటితో నిండిపోయాయి. మండలంలో ఈదురు గాలులతో కూడిన వర్షం పడటం కారణంగా పలుచోట్ల అరటి తోటలు ధ్వంసం అయ్యాయి. పంట చేతికి వచ్చే సమయంలో అరటితోటలు గాలికి పడిపోవడంతో రైతులకు అపార నష్టం వాటిల్లింది. అరటిగెలలు రుతువుకు రాక ముందే పడిపోవడంతో రైతులు విలవిలలాడుతున్నారు. అరటి గెలలకు మంచి ధర ఉన్న సమయంలో గాలులకు పడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.


పొన్నూరులో విరిగిపడిన చెట్లను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

వాణిజ్య పంటలకు అపారనష్టం

పొన్నూరు టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం పొన్నూరు చేబ్రోలు మండలాల్లో వాణిజ్య పంటల రైతులకు అపార నష్టాన్ని మిగిల్చింది. గురువారం అర్ధరాత్రి నుంచి ఒక్కసారిగా భారీగా ఈదురు గాలులు, పిడుగులు, ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులకు పొన్నూరు చేబ్రోలు మండలాల్లో సాగయ్యే వాణిజ్య పంటలు నేలమట్టమయ్యాయి.. విద్యుత్ స్తంభాలు విరిగిపడి పోవడంతో పలు గ్రామాలలో గాఢాంధకారం నెలకొంది. వివిధ ప్రాంతాలలో భారీ వృక్షాలు నేలకు ఒరిగాయి. మండలంలోని చింతలపూడిలో సుమారు 150 ఎకరాలలో తమలపాకు పంట సాగు అవుతుంది. ఈదురు గాలుల బీభత్సానికి తమలపాకు పంట నేలమట్టమయింది. ప్రతి ఏడాది కష్ట పడి లక్షల వ్యయంచేసి సాగు చేస్తున్న పంటలు ప్రకృతి వైపరీత్యాలు ధాటికి నేలవాలడంతో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. అలాగే చేబ్రోలు మండలం నారాకోడూరు, వేజెండ్ల, శలపాడు తదితర ప్రాంతాల్లో సుమారు 200 ఎకరాలలో దొండ, కాకర తోటలు నేలమట్టమయ్యాయి. లక్షలాది రూపాయల వ్యయం చేసి నిర్మించిన పందిళ్లు విరిగి పడిపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టిమిట్టాడుతున్నారు.

విరిగిన విద్యుత్ స్తంభాలు

గాలుల బీభత్సంతో పొన్నూరు, చేబ్రోలు మండలాల్లో పలు ప్రాంతాలలో విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. చేబ్రోలు మండలంలోని శలపాడు నుంచి వడ్లమూడి వచ్చే ప్రధాన రహదారి వెంట విద్యుత్ లైన్‌పై సమీపంలోని తాటిచెట్లు, విరిగిపడ్డాయి. దీంతో విద్యుత్ స్తంభాలు విరిగి రోడ్డుపై పడ్డాయి. దీంతో విద్యుత్‌శాఖ అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. చేబ్రోలు, పొన్నూరు పట్టటణంలో కూడా విద్యుత్ లైన్‌లు ధ్వంసం అయ్యాయి. ఉదయం పొన్నూరు పట్టణంలోని విరిగిపడిన చెట్లును పురపాలక సంఘం అధికారులు తొలగించారు. పలు ప్రాంతాలలో విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది విద్యుత్‌లైన్‌లకు మరమ్మతులు చేసి సరఫరాను పునరుద్ధరించారు.


చింతలపూడిలో ఈదురు గాలులకు ఒరిగిపోయిన తమలపాకు తోట

డెంగీ వ్యాధిపై అవగాహన పెంచుకోవాలి

● పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక


డెంగీపై అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక, సహాయ మలేరియా అధికారి పున్నారెడ్డి తదితరులు

తెనాలి, మారీసుపేట,మే 16 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలు డెంగీ వ్యాధిపై అవగాహన పెంచుకోవాలని ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వేముల ప్రియాంక అన్నారు. శుక్రవారం స్థానిక కొత్తపేటలోని మలేరియా యూనిట్‌లో నందులపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వేముల ప్రియాంక సహాయ మలేరియా అధికారి వంగల పున్నారెడ్డితో కలసి జాతీయ డెంగీ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ భారతదేశవ్యాప్తంగా మే 16ను జాతీయ డెంగీ దినోత్సవంగా పాటిస్తున్నామన్నారు. ముఖ్యంగా డెంగీ వ్యాధికి ఆర్బో వైరస్ ప్రధాన కారణమన్నారు. ప్రజలు దోమతెరలు వాడటం, పూర్తిగా వస్త్రధారణ ధరించడం ఇంటితో ఇంటి పరిసరాల పరిశుభ్రతలను పాటించడం ద్వారా ఈ వ్యాధి బారిన పడకుండా ఉండవచ్చన్నారు. సహాయ మలేరియా అధికారి వంగల పున్నారెడ్డి మాట్లాడుతూ డెంగీ వ్యాధిని వ్యాపింపచేసే దోమ మంచినీటిలో గుడ్లను పెడుతుందని ఈ గుడ్లు పెద్ద దోమగా మారడానికి 8 నుంచి 10 రోజులు పడుతుందని అందుకే ప్రజలు వారానికి ఒక సారి నీటి నిల్వను మార్చాలన్నారు. శుక్రవారం ఫైడే డ్రైడేగా పాటిద్దామన్నారు. అనంతరం జాతీయ డెంగీ దినోత్సవ అవగాహన ర్యాలీని పట్టణంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, పట్టణ సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, మలేరియా, ఫైలేరియా సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, వార్డు హెల్త్ సెక్రటరీలు, ఆరోగ్య పర్యవేక్షకులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కొల్లిపరలో...

కొల్లిపర, మే 16 (ఆంధ్రజ్యోతి): పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మండల వైద్యాధికారి సుమంత్ అన్నారు. శుక్రవారం జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రం కొల్లిపరలో ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది, వైద్యాధికారులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి సుమంత్ మాట్లాడుతూ పారిశుధ్యంపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే అంటువ్యాధులను అరికట్టవచ్చునన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, ఎఎన్ఎమ్‌లు లక్ష్మి, మణిమ్మ, ఆషా కార్యకర్తలు మల్లేశ్వరి, పద్మ, ప్రేమకుమారి, వాణి పాల్గొన్నారు.

పొన్నూరులో...

పొన్నూరు టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): డెంగీ వ్యాధి నివారణకు దోమల నివారణ చర్యలు చేపట్టాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హరిణి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఇందిరాగనర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో జాతీయ డెంగీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీ, ప్రతిజ్ఞ నిర్వహించారు. దోమల ఉధృతిని, నివారించే చర్యలపై అవగాహన కల్పించారు. దోమల నివారణపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కే హరిబాబు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అలాగే చేబ్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ అబ్రహాం లింకన్, డాక్టర్ శైలజ ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ డెంగీ నివారణ కార్యక్రమాన్ని నిర్వహించి అవగాహన ర్యాలీ చేశారు.


కార్మికులకు కిట్లను పంపిణీ చేస్తున్న మునిసిపల్ చైర్‌పర్సన్ రాధిక, కమిషనర్ శేషన్న

కార్మికుల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం కృషి

● మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక

తెనాలి, మారీసుపేట,మే 16 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికుల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని మునిసిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అన్నారు. శుక్రవారం స్థానిక మార్కెట్ సెంటర్‌లోని మునిసిపల్ కార్యాలయంలోని మెప్మా హాల్‌లో మునిసిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక కమిషనర్ శేషన్నతో కలసి పారిశుధ్య కార్మికులకు కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ రాధిక మాట్లాడుతూ ప్రభుత్వం పారిశుధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణకై ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. అందులో భాగంగా శానిటేషన్ సిబ్బందికి రేడియం జాకోట్లు, సబ్బులు, కొబ్బరి నూనె, టోపీలు, చేతి గ్లోజులను 400మంది రెగ్యులర్, ఆప్కాస్ పారిశుధ్య కార్మికులకు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న, అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు, ఎంహెచ్‌వో డాక్టర్ హెలెన్ నిర్మల, 15వ వార్డు కౌన్సిలర్ జి.కోటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

భావదేవుని ఆలయాన్ని పట్టించుకోండి

● పురావస్తు శాఖ రీజనల్ డైరెక్టర్‌కు పండితులు, భక్తుల వినతి

బాపట్ల, మే 16 (ఆంధ్రజ్యోతి): ఘనమైన చరిత్ర కలిగిన శ్రీమత్సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత శ్రీ క్షీరభావన్నారాయణస్వామి దేవాలయాన్ని పట్టించుకోవాలంటూ ఆలయ పండితులు, భక్తులు శుక్రవారం బాపట్ల ఆలయానికి విచ్చేసిన దక్షిణ భారత పురావస్తుశాఖ రీజనల్ డైరెక్టర్ ఎన్‌కే పాఠక్‌ను కోరారు. పురావస్తుశాఖ పరిధిలోని ఈ ఆలయంపై వెంటనే స్పందించి తగువిధంగా అభివృద్ధి చేయాలని కోరారు.

మెప్మా కార్యకలాపాలకు మహిళా మండలి భవనం సిద్ధం

తెనాలి అర్బన్, మే 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొత్తపేట సరోజిని నాయుడు రోడ్డులోని మహిళా మండలి భవనాన్ని మెప్మా కార్యకలాపాలకు వినియోగించుకునేందుకు సిద్ధం చేశారు. 1968లో మహిళలు కమిటీగా ఏర్పడి మహిళా సంక్షేమం కోసం 300 గజాల స్థలంలో భవనం నిర్మించారు. మహిళల ప్రగతికి అవసరమైన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు మహిళా బాలల గ్రంథాలయాన్ని కూడా జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. కొన్నేళ్లుగా మహిళా మండలి కార్యకలాపాలు నిలిచిపోవడంతో విలువైన ఆస్తి అన్యాక్రాంతం కాకుండా ఉండేందుకు గాను కమిటీ సభ్యులు ప్రభుత్వానికి అప్పగించారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పర్యవేక్షణలో ఈ ఆస్తిని మున్సిపాలిటీకి రిజిస్ట్రేషన్ చేశారు. ఈ భవనాన్ని మహిళా సాధికారత కార్యక్రమాలకు మాత్రమే వినియోగించుకోవాలని మహిళా మండలి కమిటీ సభ్యులు స్పష్టం చేయడంతో ఇక్కడ మున్సిపల్ పరిధిలోని మెప్మా విభాగాన్ని నిర్వహించేందుకు గాను నిర్ణయించారు. మిషన్ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ పావర్టీ ఇన్ మున్సిపల్ ఏరియాస్ విభాగం నిర్వహించేందుకు గాను నిధులు కేటాయించి భవనాన్ని మరమ్మతులు చేయించి సిద్ధం చేశారు. మెప్మా విభాగంలో సిటిమిషన్ మేనేజర్ ఆధ్వర్యంలో ఆరుగురు కమ్యూనిటీ ఆర్గనైజర్లు, 84 మంది రిసోర్స్ పర్సన్లు, మహిళా సంక్షేమానికి కృషి చేస్తున్నారు. పట్టణ పరిధిలో 2600కి పైగా మహిళా సంఘాలు ఉండగా ప్రతి సంఘంలో 10మంది సభ్యుల వరకు ఉన్నారు. వీరి ఆర్థిక ప్రగతి ప్రభుత్వ కార్యక్రమాల అమలు మెప్మా చూస్తోంది.


మెప్మా విభాగం కోసం సిద్ధం చేసిన మహిళా మండలి భవనం


సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కంట్రోలర్ మాధురి

ప్రతి ప్యాకింగ్ వస్తువుకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

● లీగల్ మెట్రాలజీ జాయింట్ కంట్రోలర్ మాధురి

తెనాలి అర్బన్, మే 16 (ఆంధ్రజ్యోతి) : ఆహార పదార్థాల తయారీ, విక్రయదారులు తమ ఉత్పత్తులను ప్యాకింగ్ చేసి విక్రయించడానికి ప్యాకర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని లీగల్ మెట్రాలజీ జాయింట్ కంట్రోలర్ ఎంఎస్ఎస్ మాధురి చెప్పారు. తూనికలు, కొలతలు శాఖ అవగాహన వారోత్సవాలలో భాగంగా గౌతమ్ గ్రాండ్ హోటల్‌లో శుక్రవారం సదస్సు నిర్వహించారు. దాల్ మిల్స్ అసోసియేషన్ సహకారంతో నిర్వహించిన సదస్సులో ఎలక్ట్రానిక్ వెయింగ్ మిషన్‌ను దాల్‌మిల్లుల యజమానులు ప్రతి ఏటా లీగల్ మెట్రాలజీ వారిచే ధృవీకరించుకోవాలన్నారు. ప్యాకేజ్డ్ కమోడీటీస్ రూల్స్ 2011 ప్రకారం 25 కిలోల లోపు ప్యాక్‌చేసిన బ్యాగులపై డిక్లరేషన్స్ పేరు, తయారీదారు, చిరునామా, బరువు, కాలం, ధర, ఫోన్ నెంబరు, యూనిట్ సేల్ వివరాలను ముద్రించాలన్నారు. అసిస్టెంట్ కంట్రోలర్లు కొండారెడ్డి, అల్లూరయ్య, ఇన్‌స్పెక్టర్లు సునీల్‌రాజు, శేషసాయి, సాయిశ్రీకర్, జాన్‌సైదా పాల్గొన్నారు.


గ్రీవెన్స్ డేలో సమస్యలు తెలుసుకుని అర్జీలు స్వీకరిస్తున్న నాయకులు

టీడీపీ కార్యాలయంలో గ్రీవెన్స్ డే

తెనాలి రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): తెనాలి నియోజవర్గ టీడీపీ కార్యాలయంలో గ్రీవెన్స్ డేను నిర్వహించారు. ప్రతి శుక్రవారం నియోజవర్గంలోని ప్రజల సమస్యలు తెలుసుకుని సత్వర పరిష్కారానికి ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో పలువురు హాజరై వారి సమస్యలను వివరించి వినతి పత్రాలు అందించారు. పింఛన్లు, రేషన్ కార్డులు, నివేసన స్థలాలు వంటివి వచ్చినట్లు నాయకులు తెలిపారు. మహమ్మద్‌ఖుద్దూస్, కౌన్సిలర్ బోయపాటి అరుణ, జొన్నాదుల మహేష్, తాడిబోయిన హరిప్రసాద్, కేసన కోటేశ్వరరావు, పసుపులేటి త్రిమూర్తి పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్రను జయప్రదం చేద్దాం

● మున్సిపల్ కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట,మే 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆధ్వర్యంలో నేడు శనివారం జరగనున్న స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర స్వచ్ఛత తెనాలి కార్యక్రమాన్ని జయప్రదం చేద్దామని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న అన్నారు. శుక్రవారం స్థానిక మార్కెట్ సెంటర్‌లోని మునిసిపల్ కార్యాలయంలో కమిషనర్ చాంబర్‌లో మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక తో కలసి విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శేషన్న మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి నెల మూడో శనివారం స్వచ్ఛ దినంగా ప్రకటించి ప్రతి నెల ఒక నిర్దిష్ట అంశాలతో కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా ఈ నెల 17న స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్రలో భాగంగా బీట్ ది హీట్ కార్యక్రమం చేపట్టామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌లు పాల్గొంటారని ప్రజలు వేలాదిగా పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఉదయం గం.7లకు శివాజీచౌక్ కూడలి నుంచి ప్రారంభమై మహాత్మాగాంధీ మునిసిపల్ మార్కెట్ వరకు, సాయంత్ర గం.4 లకు జిల్లా ప్రభుత్వ వైద్యశాల నుంచి ప్రారంభమై గుంటూరు రోడ్డులోని రావి కన్వెన్షన్ హాల్ వరకు జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని కమిషనర్ శేషన్న పేర్కొన్నారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసునికి పద్మశాలీ సంఘం పట్టు వస్త్రాలు

తెనాలి అర్బన్, మే 16 (ఆంధ్రజ్యోతి): వైకుంఠపురంలోని శ్రీనివాసుని కల్యాణానికి పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో పట్టు వస్త్రాలు సమర్పించనున్నట్లు సంఘ సభ్యులు శుక్రవారం తెలిపారు. శ్రీలక్ష్మీ పద్మావతీ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణం ఈ నెల 18న ఆలయంలో నిర్వహించనున్నారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలలో భాగంగా జరుగుతున్న కల్యాణానికి మెయిన్‌రోడ్డు శ్రీభద్రావతి సమేత శ్రీభావనరుషి స్వామి వారి ఆలయం నుంచి పద్మావతీ అమ్మవారికి పుట్టినింటి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు, పండ్లు, పూలు సమర్పించే అవకాశం పద్మశాలీయులకు లభించిందని పద్మశాలీ బహుత్తమ సంఘం గౌరవ అధ్యక్షుడు జొన్నాదుల మహేష్ చెప్పారు. ఆదివారం సాయంత్రం 4గంటలకు ఆలయం నుంచి ఊరేగింపుగా పట్టువస్త్రాలు సమర్పించేందుకు సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు. దీనిపై కరపత్రాల విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో గుంటి వెంకట్, తిరువీధుల సాంబశివరావు, పి.భాస్కరరావు, గోపాలరావు, భాస్కర్, వెంకటేష్, బాలాజీ బాల శ్రీనివాసరావు, ఎ.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కిశోరీ బాలికలు ఆరోగ్య సూత్రాలు పాటించాలి

● ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక

కొల్లిపర, మే 16 (ఆంధ్రజ్యోతి): కిశోరీ బాలికలు తప్పనిసరిగా ఆరోగ్య సూత్రాలను పాటించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చెముడుబాడు అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరీ బాలిక వికాసంపై ఐసీడీఎస్ అధికారులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రాధిక మాట్లాడుతూ కిశోరీ బాలికలు ఆరోగ్య పరీక్షలతో పాటు పోషకవిలువైన ఆహారాన్ని తీసుకోవడం మంచిదన్నారు. కిశోరీ బాలికలు వ్యక్తిగత పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించాలన్నారు. కిశోరీ బాలికలపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎమ్ఎస్‌కే ఆళ్ళ జయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులు అప్రమత్తంగా వ్యవహరించాలి

● ప్రభుత్వ ఉద్యోగాలిప్పిస్తామని టోకరా వేస్తున్నారు: వీరవల్లి

తెనాలి రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగుల కుటుంబాలనే టార్గెట్‌గా చేసుకుని ప్రభుత్వ కొలువులు ఇప్పిస్తామంటూ కొందరు ముఠాగా ఏర్పడి రూ.లక్షల్లో వసూలు చేస్తూ కుచ్చుటోపి పెడుతున్నారని అటువంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని గణేష్‌యూత్ కన్వీనర్, టీడీపీ సీనియర్ నేత వీరవల్లి మురళి అన్నారు. గురువారం మండలంలోని అంగలకుదురులో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ ప్రభుత్వ కొలువులు ఇప్పిస్తామంటూ మోసాలకు పాల్పడుతున్నారన్నారు. గుంటూరు కేంద్రంగా సాగుతున్న ఈ ముఠా బారిన పడి ఉద్యోగాలు రాక, ఎవరికీ చెప్పుకోలేని పరిస్థితుల్లో నలిగిపోతున్న కుటుంబాలను తెనాలి పరిసర గ్రామాల్లో గమనించామన్నారు. ఉద్యోగాలిపిస్తామని నమ్మబలికే ప్రయత్నం చేసే వారిపై అప్రమత్తంగా ఉంటూ అటువంటి వారిపై పోలీసులకు సమాచారం ఇచ్చి నేర నియంత్రణకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ నాగభూషణం, గొల్లపూడి సాయి గిరి, ముక్కాముల సుబ్బయ్య, పాలడుగు నాగయ్య, పేరం నవీన్ తదితరులు పాల్గొన్నారు.